శనివారం
21-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 270
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

45 రోజుల తర్వాత తొలగించండి: ఈసీ

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఈవీఎంలపై ఇప్పటికే అనేక రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో ఏకంగా ఎన్నికల సరళికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేసి తప్పుడు కథనాలు సృష్టించే ప్రమాదం ఉందంటూ ఈ వీడియోలను 45 రోజుల్లో తొలగించాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ఫలితంపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ఆ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ కెమెరా రికార్డింగ్‌లు, వెబ్‌కాస్టింగ్, వీడియో ఫుటేజ్‌లు తొలగించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులకు

- మిగతా 2 లో

రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై ముగిసిన విచారణ

విశాలాంధ్ర-హైదరాబాద్ : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో 2016లో తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలో సర్వే నంబర్ 127లో ఉన్న 31 ఎకరాల భూమి హక్కుల విషయమై ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి,

- మిగతా 2 లో

శుభాంశు అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా

ఫ్లోరిడా: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. ఈ నెల 22న ఈ రోదసి యాత్ర ఉంటుందని ఇటీవల ఇస్రో ప్రకటించింది. అయితే, తాజాగా ఈ యాక్సియం-4 ప్రయోగం వాయిదా పడిందని నాసా ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రయోగానికి సంబంధించిన కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించింది. యాక్సియం-4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు రోదసియాత్ర చేపట్టనున్నారు. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అయ్యా.. యోగా డే అయిపోగానే మమ్మల్ని వదిలేస్తే, మా పొట్టతిప్పలేవో మేం చూసుకుంటాం.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మా హక్కులు వదులుకోం

- 'గోదావరి-బనకచర్ల'పై చంద్రబాబుతో చర్చిస్తాం
- తెలంగాణ అభిప్రాయం తీసుకోవాల్సిందే
- కృష్ణా జలాలపై హరీశ్‌రావు వాదనల్లో పసలేదు
- మీడియా చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ: గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తాము ఎవరితో వివాదాలు కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 23న తెలంగాణ క్యాబినెట్ సమావేశం జరుగుతుందని... అక్కడ చర్చించిన తర్వాత చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణను ఏపీ మొదట ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడమే తమ అభ్యంతరమని తెలిపారు. ఏపీ విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఢిల్లీలో శుక్రవారం రేవంత్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఎవరితోనూ తాము వివాదం కోరుకోవడం లేదని.. ఎవరికోసమో తెలంగాణ హక్కులు వదులుకోమని స్పష్టం చేశారు. కృష్ణాజలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌ఓసీ తాను అడిగినందుకు మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని... ఆయన వాదనలో పస లేదని చెప్పారు. 2023లో కేంద్రానికి హరీశ్‌రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు. తెలంగాణలో తమ ప్రాజెక్టులు పూర్తయి, పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకున్న తర్వాతే ఆంధ్రప్రదేశ్ తమ ప్రాజెక్టుల గురించి ఆలోచించాలని కోరారు . నీళ్లు, నిధుల పేరిట మోసపూరిత సెంటిమెంట్‌ని గతంలో బీఆర్ఎస్ నేతలు అడ్డుపెట్టుకున్నారని.. ఇప్పుడు జలాలను సంజీవని అని భావిస్తున్నారని సీఎం అన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని మండిపడ్డారు. గతంలో ఏపీకి అన్ని హక్కులు రాసిచ్చారని ఆరోపించారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని మాజీ సీఎం కేసీఆర్ అన్నారని చెప్పారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కేసీఆర్ అనలేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 50

- మిగతా 2 లో

జనావాసాలపై దాడి

ఇజ్రాయిల్ ఘాతుకం

- ఇరాన్ దాడులకు బలహీనమైన ఐరన్ డోమ్
- పరిపాలన చిహ్నాల ధ్వంసానికి నెతన్యాహు ఆదేశం

టెహ్రాన్/టెల్‌అవీవ్: ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఎనిమిదవ రోజు యుద్ధం ఉగ్రరూపం దాల్చింది. మరింత భీకరంగా సాగింది. పరస్పర దాడులతో రెండు దేశాలు రగలిపోతున్నాయి. ఇరాన్‌పై యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయాలని ఇజ్రాయిల్ సైన్యాధికారి ఇజ్రాయిల్ కట్జ్ శుక్రవారం తమ సైన్యానికి ఆదేశాలిచ్చారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని పరిపాలన చిహ్నాల ధ్వంసానికి ఆదేశించారు. ఇరాన్‌ను పూర్తిస్థాయిలో అస్థిరపర్చేలా ఉత్తర్వులు జారీచేశారు. 'పరిపాలన సంబంధిత చిహ్నాలపై దాడి చేయండి. పరిపాలనకు పవన్ బేస్‌గా ఉండే రివల్యూషనరీ గార్డ్స్, బసిజ్ (మిలిషియా) వంటి వ్యవస్థలను ధ్వంసం చేయండి' అంటూ కట్జ్ ఒక ప్రకటన చేశారు. ఇదే క్రమంలో సెంట్రల్ టెహ్రాన్‌లోని గిషా జిల్లాలోని అపార్టుమెంట్‌పై ఇజ్రాయిల్ డ్రోన్ దాడి చేసింది. ఇరాన్ ప్రతీకార దాడులతో జెరూసలేం, టెల్‌అవీవ్ దద్దరిల్లిపోయాయి. ఆ నగరాల్లో పేలుళ్లు వినిపించాయి. ఇరాన్ క్షిపణులను తమ రక్షణ వ్యవస్థ సమర్థంగా అడ్డుకుంటున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇజ్రాయిల్‌పై క్షిపణి దాడులను చేపట్టినట్లు ఇరాన్ వెల్లడించింది. వరుసగా ఎనిమిది రోజులుగా ఇరాన్ చేస్తున్న క్షిపణి దాడులతో అత్యంత భద్రతమైనదిగా భావించే ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థ బలహీనమైనట్లు సంకేతాలు ఉన్నాయి. కంబైన్డ్ మిసైళ్లు, డ్రోన్లతో హైఫా, టెల్‌అవీవ్‌పై దాడి చేసినట్లు ఇరాన్ ధ్రువీకరించింది. పెరుగుతున్న దాడుల తీవ్రతతో ఐరన్ డోమ్‌కు పగుళ్లు వచ్చినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 657 మంది ఇరాన్ ప్రజలు చనిపోయారని అమెరికాకు చెందిన ఇరాన్ మానవ హక్కుల సంస్థ వెల్లడించింది. మృతుల్లో సైన్యాధికారులు, అణు శాస్త్రవేత్తలతో పాటు 263 మంది సామాన్యులు ఉన్నారని తెలిపింది. దాదాపు రెండు వేల మందికిపైగా గాయపడినట్లు పేర్కొంది. అలాగే ఇరాన్ దాడులతో ఇజ్రాయిల్‌లోనూ ప్రాణ నష్టం జరిగిందని, 25 మందికిపైగానే చనిపోయారని వెల్లడించింది. ఇరాన్ 450 క్షిపణులు, వెయ్యి డ్రోన్లను ఇప్పటివరకు ఇజ్రాయిల్‌పైకి ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఇరాన్ అధినేత ఆయాతుల్లా ఖామేని ప్రాణాలతో ఉండేందుకు వీల్లేదని, ఆయనను అంతం చేస్తామని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఖామేని కూడా దీటుగా బదులిస్తూ.... ప్రాణత్యాగానికైనా సిద్ధం, తల వంచే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఇదే క్రమంలో ఇజ్రాయిల్‌పై క్షిపణులతో ఇరాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. తమ దేశంలోని బీర్‌షేబా నగరంలోని

- మిగతా 2 లో

భారత్ కోసం గగనతలం తెరిచిన ఇరాన్

ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్నప్పటికీ అక్కడున్న భారతీయుల్ని వారి స్వదేశానికి తరలించేందుకు టెహ్రాన్ చర్చలు తీసుకుంది. భారత్ కోసం తమ గగనతలాన్ని శుక్రవారం తెరిచింది.

2లో

ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు ఉత్తమం

'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల' పునర్నిర్మాణంపై అఖిలపక్షం

'గోదావరి-బనకచర్ల' నిలిపివేయాలి: కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్ : తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునర్నిర్మాణం లేదా మరమ్మతులు సాధ్యాసాధ్యాలపై అఖిలపక్షం, ఇరిగేషన్ మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును మొదటి నుంచి సీపీఐ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. దాని బదులుగా గతంలో నిర్ణయించిన ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్దనే బ్యారేజీ నిర్మిస్తే, ఒక్క లిఫ్టు ద్వారా ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తీసుకెళ్లే అవకాశం ఉండేదన్నారు. రీడిజైన్ పేరుతో దానిని పక్కనబెట్టి, కాళేశ్వరం పేరుతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువన నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి ఎగువన ఎల్లంపల్లికి నీటిని లిఫ్టు చేయడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని చెప్పారు. ఒకవేళ అవి పనిచేసినా విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. విజిలెన్స్, జస్టిస్ పి.సి.ఘోష్ నివేదికలు వచ్చాక అఖిలపక్షాలు, ఇరిగేషన్ నిపుణులతో చర్చించాల్సిన అవసరం ఉందని కూనంనేని సూచించారు. ఈ నేపథ్యంలో తక్షణమే తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఎల్లంపల్లికి నీరు తీసుకెళ్లాలని, మధ్యలో ఆదిలాబాద్ జిల్లాకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సుమారు రూ.లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరంలో ప్రధాన భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా మారాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎల్లంపల్లి నుంచి దిగువన మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ రిజర్వాయర్ ఉన్నందున, తుమ్మిడిహట్టి నుంచి నీళ్లు తీసుకున్నా ఇబ్బంది ఉండబోదన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కింద ఇప్పటికే 70 కిలో మీటర్ల మేరకు కాలువలు పూర్తయ్యాయని తెలిపారు. అక్కడి నుంచి దిగువ ప్రాంతాలకు నీరు వస్తున్న మైలారం వద్ద 20 మీటర్ల లిఫ్ట్ ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా 40 కిలోమీటర్ల కాల్వ తవ్వితే నేరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీరు వస్తుందన్నారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను మినహాయించి మేడారం, మోతే, మిడ్ మానేరు, అనంతగిరి, రంగనాయక సాగర్,

- మిగతా 2 లో

సాంస్కృతిక ఆధిపత్యానికే...

దేశీయ భాషలపై ప్రేమ కాదు... హిందీని ఆపాదించే యత్నం

ఆంగ్లంపై అమిత్‌షా వ్యాఖ్యలకు సీపీఐ ఖండన

న్యూఢిల్లీ: బీజేపీ భాష-సాంస్కృతికపరమైన ఆధిపత్యాన్ని కోరుకుంటోందని, ఆ పార్టీకి భారతీయ భాషలపై ప్రేమ లేదని, హిందీని రుద్దేందుకు యత్నిస్తోందని సీపీఐ విమర్శించింది. ఆంగ్ల భాషపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఆంగ్లం మాట్లాడేందుకు సిగ్గుపడే రోజు వస్తుందన్న కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఎంపీ సంతోశ్ కుమార్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో దుయ్యబట్టారు. అమిత్ షా మాటలతో జాతీయ భాషగా హిందీని ఆపాదించడానికి, ఆర్ఎస్ఎస్-బీజేపీ ఏకపక్ష అజెండా అమలు దిశగా జరుగుతున్న ప్రయత్నం స్పష్టమవుతోందన్నారు. 'ఆంగ్లమన్నది బ్రిటిష్ వాళ్ల ద్వారా భారత్‌కు వచ్చినప్పటికీ అది ప్రాంతాలను కలుపుతుంది. స్వాతంత్ర్య సమరంలో ఐక్యతకు దోహదమైంది. కులం, వర్గం, ప్రాంతాలకు అతీతంగా లక్షలాది మందికి సాధికారికత చేకూర్చింది. ఈ భాష మాట్లాడటం సిగ్గుచేటు అనడం భారత యువత, శ్రామిక వర్గ ఆశలను చంపేయడమే' అని రాజా వ్యాఖ్యానించారు. అమిత్‌షా మాటలు ఆంగ్లంపైనే దాడి కాదని, సంఘ్ పరివార్

- మిగతా 2 లో

సన్నాలకు బోనస్... బోగస్సే

తక్షణమే రూ.1,161 కోట్లు విడుదల చేయాలి

డబ్బు కోసం పొద్దు తిరుగుడు రైతుల ఎదురుచూపు

రేవంత్ సర్కార్ తీరుపై హరీశ్‌రావు ధ్వజం

విశాలాంధ్ర-హైదరాబాద్ : సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వ మాటలు... బోగస్ అయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ.1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. సుమారు 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పొద్దు తిరుగుడు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం



పడుతుందని అన్నారు. ఒక సిద్దిపేట జిల్లాలోనే 50 శాతం రైతులకు డబ్బులు ఇవ్వలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వేస్తామని ప్రగల్భాలు పలికిన మంత్రి, రెండు నెలలు దాటినా ఇప్పటికీ

- మిగతా 2 లో

పెట్టుబడులకు వేదిక తెలంగాణ

- ఫార్మా, ఐటీ రంగాల్లో అగ్రగామి
- సీఎస్ఆర్ నిధుల వినియోగం శ్రేయస్కరం
- అసోచామ్ సదస్సులో భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్: అభివృద్ధికి కొత్త నిర్వచనం, పెట్టుబడులకు వేదిక... సీఎస్ఆర్ నిధులకు తగిన రాష్ట్రం తెలంగాణ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సామాజిక న్యాయం ఆధారిత ఆర్థిక వృద్ధి సాధించడమే కాంగ్రెస్ సిద్ధాంతంగా తెలిపారు. వైద్యం, ఫార్మా, ఐటీ రంగాల్లో రాణిస్తున్నట్లు చెప్పారు. భట్టి విక్రమార్క శుక్రవారం హైదరాబాద్‌లోని ది విస్టిన్, మైండ్‌స్పేస్‌లో జరిగిన అసోచామ్ సదస్సులో మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణ నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నాం. సామాజిక న్యాయం పునాదిపై ఆర్థిక వృద్ధి జరగాలి. పారిశ్రామికవేత్తల చర్యలు బాధ్యతగా ఉండాలి. ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం పనిచేయాలి' అని భట్టి విక్రమార్క అన్నారు. సంస్థల నిర్మాణం మాత్రమే కాదు సమాజాల శ్రేయస్సు కోసం కూడా పని చేయాలని కార్పొరేట్లకు సూచించారు. అనుకున్న లక్ష్యాలు నూటికి నూరు శాతం నెరవేర్చగల సామర్థ్యంగల రాష్ట్రమని, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల ఖర్చునకు తెలంగాణను ఎంచుకోవాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో అనుకూలమైన వాతావరణం

- మిగతా 2 లో

బాంబులు, బెదిరింపులకు లొంగం

తెహ్రాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు

2లో

బాంబులు, బెదిరింపులకు లొంగం

తెహ్రాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు: పాల్గొన్న వేలాది మంది

తెహ్రాన్: ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఎనిమిది రోజులుగా భీకర పోరు సాగుతోంది. అణ్వస్త్రాలు కలిగివున్న నెపంతో ఇరాన్ కీలక అణు కేంద్రాలు, స్థావరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేస్తోంది. ఇరాన్ కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయిల్‌ను దెబ్బ తీస్తోంది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా రంగంలోకి దిగడంతో యూద దేశం పనైపోయినట్టేనని ఇరాన్ ఎద్దేవా చేస్తోంది. ఇదే క్రమంలో బాంబులకు, బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని ఇరాన్ ప్రజలు తేల్చిచెప్పారు. తమ నాయకుడు ఆయాతుల్లా ఖామేనీ కోసం ప్రాణాలిచ్చేందుకైనా సిద్ధమని ముక్తకంఠంతో నినదించారు. ఇజ్రాయిల్ దాడులు, అమెరికా బెదిరింపులకు వ్యతిరేకంగా రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలిపారు. తలొగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తమ నాయకులకు అనుకూలంగా, ఇజ్రాయిల్-అమెరికాకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు ఇచ్చారు. తమ దేశ వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని ఇరాన్ ప్రజలు తీవ్రంగా ఆక్షేపించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థన తర్వాత రాజధాని తెహ్రాన్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. దేశ సైన్యానికి మద్దతుగా నిర్వహించిన ప్రదర్శనల్లో ఇరాన్ సీజే గులాం హుస్సేన్ మొహసెనీ, ఐఆర్‌జీసీ మాజీ కమాండర్ మేజర్ జనరల్ మహమ్మద్ అలీ జాఫరీ, పార్లమెంటు డిప్యూటీ స్పీకర్‌తో పాటు అనేక మంది మంత్రులు, నాయకులు భాగస్వాములయ్యారు. తెహ్రాన్ ప్రదర్శనలో వేలాది మంది పాల్గొన్నారు. పలస్తీనా, ఇరాన్ జెండాలతో కదం తొక్కారు. ఇజ్రాయిల్ బాంబులకు, అమెరికా బెదిరింపులకు లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. 'అవసరమైతే మా నాయకుడి కోసం ప్రాణాలు ఇస్తాం', 'ఇజ్రాయిల్ దాడులను తిప్పికొడతాం', అమెరికా బెదిరింపులకు భయపడబోం' అన్న బ్యానర్లను ప్రదర్శించారు. నినాదాలతో ఆయా ప్రాంతాలను హోరెత్తించారు. వాయువ్య ఇరాన్‌లోని తబ్రీజ్, దక్షిణ ఇరాన్‌లోని షిరాజ్‌తో పాటు మషాద్, ఇస్ఫాహన్, ఖామ్, ఖాజ్విన్, యజ్ద్, గిలన్ సహా చిన్న, పెద్ద నగరాల్లో ర్యాలీలు జరిగాయి. 'ఇది దేశ ప్రజల సంఘీభావం.... ప్రతిఘటనల శుక్రవారం' అంటూ ఈ ర్యాలీలను స్థానిక మీడియా ప్రసారం చేసింది.

ఫోన్‌కాల్ తెచ్చిన తిప్పలు

థాయిలాండ్ ప్రధానికి పదవీ గండం

బ్యాంకాక్: థాయిలాండ్ ప్రధాని పెటోంగటార్న్ షినావత్రాను ఒక ఫోన్ కాల్ చిక్కుల్లో పడేసింది. ఆమె పదవికి గండం ఏర్పడింది. కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌తో ఆమె ఫోన్ సంభాషణ లీకైంది. దీంతో రాజకీయ దుమారం రేగింది. ఆమె రాజీనామాకు డిమాండ్ వచ్చింది. ఫోన్ కాల్‌లో తనకు ప్రత్యర్థిగా సంబోధించిన సీనియర్ సైన్యాధికారిని ఆమె శుక్రవారం కలిశారు. అందుకోసం ఆమే ఈశాన్య థాయిలాండ్‌లోని చోంగ్ బోక్ అనే ప్రాంతానికి వెళ్లారు. సెకెండ్ ఆర్మీ రీజన్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ బూన్‌సిన్ పడ్క్లాంగ్‌తో తన సంబంధాలను చక్కబెట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ మేరకు బ్యాంకాక్ పోస్టు వెల్లడించింది. 38 ఏళ్ల షినావత్రా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఏడాది కూడా కాలేదు. ఈలోగా వివాదంలో చిక్కుకోవడంతో ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పుకోవాల్సి వచ్చింది. తమ సంభాషణను హున్ సేన్ ఆన్‌లైన్‌లో పెట్టడంతో వివాదం మొదలైంది. వీరిద్దరి మధ్య ఈనెల 15న ఫోన్ సంభాషణ జరిగింది. ఇటీవల థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణ గురించి ఇద్దరు చర్చించుకున్నారు. హున్ సేన్‌ను 'అంకుల్' అని సంబోధించిన షినావత్రా... లెఫ్టినెంట్ జనరల్ పడ్క్లాంగ్‌ను విరోధిగా వ్యవహరించారు. వీరిద్దరి ఫోన్ సంభాషణ లీకైంది. కంబోడియా-థాయ్‌లాండ్ మధ్య సరిహద్దు వివాదాలతో సంబంధాలు దెబ్బతిన్న తరుణంలో తాజా పరిణామం వివాదాస్పదమైంది. ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. దేశ పరువు, ఆర్మీ గౌరవం మంటగలిపారంటూ ఆరోపణలు వచ్చాయి. తక్షణమే పదవిలో నుంచి తప్పుకోవాలని డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే షినావత్రా నేతృత్వ సంకీర్ణ ప్రభుత్వం నుంచి కన్జర్వేటివ్ భూమ్‌జాయ్‌థాయ్ పార్టీ విడిపోయింది. పార్లమెంట్‌లో 69 మంది ఎంపీలు ఆమెకు మద్దతు విరమించుకున్నారు. దీంతో మెజార్టీ పడిపోయింది. ఈ పరిస్థితి సంకీర్ణ ప్రభుత్వంలో తిరుగుబాటుకు సంకేతాలిస్తున్నది. అదే జరిగితే ప్రభుత్వం కుప్పకూలుతుంది. ఇది రాజకీయ అనిశ్చితికి దారితీయొచ్చు. మళ్లీ ఎన్నికలు రావచ్చు.

సౌదీ దౌత్యంతోనే కాల్పుల విరమణ: పాక్

ఇస్లామాబాద్: తమ దేశంపై దాడులు ఆపాలని భారత్‌ను కోరామని, సౌదీ అరేబియా భారత్‌తో జరిపిన చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ జరిగిందని పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో దాడులు ఆపాలంటూ భారత్‌ను తామే స్వయంగా కోరినట్లు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. పాకిస్థాన్‌లోని నూర్‌ఖాన్, షోర్కోట్ వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసిందన్నారు. 'మే 6-7 తేదీల మధ్య రాత్రి ఎదురుదాడికి పాకిస్థాన్ సిద్ధమవుతున్నప్పుడు, భారత్ వైమానిక దాడి చేసింది. నూర్ ఖాన్-షోర్కోట్ వైమానిక స్థావరాన్ని దెబ్బతీసింది' అని ఇషాక్ దార్ తెలిపారు. భారత దాడుల జరిపిన దాదాపు 45 నిమిషాల తర్వాత సౌదీ యువరాజు ఫైసల్ ఫోన్‌లో మాట్లాడారని చెప్పారు. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మాట్లాడాలా అని అడిగారన్నారు. మీరు ఆగిపోతే, భారత్ కూడా దాడులు ఆపవచ్చని ఆయన అన్నారని, ఇందుకు సుముఖత వ్యక్తం చేయడంతో సరే భారత్‌తో మాట్లాడతా అని చెప్పారు. జైశంకర్‌తో మాట్లాడిన తర్వాత నాకు ఫోన్ చేసి విషయం చెప్పారని ఇషాక్ దార్ వెల్లడించారు. సౌదీ దౌత్యంతోనే కాల్పుల విరమణ జరిగిందన్నారు. అయితే ఈ విషయంలో అమెరికానూ సంప్రదించినట్లు చెప్పారు.

భారత్ కోసం గగనతలం తెరిచిన ఇరాన్

తెహ్రాన్: ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్నప్పటికీ అక్కడున్న భారతీయుల్ని వారి స్వదేశానికి తరలించేందుకు తెహ్రాన్ చర్యలు తీసుకుంది. భారత్ కోసం తమ గగనతలాన్ని శుక్రవారం తెరిచింది. దీంతో ఇరాన్ నుంచి దాదాపు వెయ్యి మంది భారతీయ విద్యార్థులతో తొలి విమానం భారత్‌కు బయల్దేరింది. ఇది రాత్రి 11 గంటలకు (భారత కాలమానం ప్రకారం) దిల్లీకి చేరుకునే అవకాశం ఉంది. మరో రెండు విమానాలు శనివారం బయల్దేరుతాయని సమాచారం. యుద్ధం కారణంగా గగనతలాన్ని మూసివేసిన ఇరాన్ కేవలం భారత్ కోసం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. భారతీయ విమానాలకు మాత్రమే అనుమతిచ్చింది.

రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై ముగిసిన విచారణ

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో పాటు లక్ష్మయ్యకు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే 2016లో సొసైటీకి చెందిన స్థలంలోకి కొందరు అక్రమంగా ప్రవేశించారని, అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఇది జరిగిందని సొసైటీ ప్రతినిధి ఎన్.పెద్దిరాజు ఆరోపించారు. తను వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే తనను వారు కులం పేరుతో దూషించారంటూ 2016లో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రేవంత్ రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని అభ్యర్థిస్తూ రేవంత్ రెడ్డి 2020లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఘటనా స్థలంలో రేవంత్ రెడ్డి లేరని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అప్పటి ప్రభుత్వం ఈ కేసు బనాయించిందని కోర్టుకు విన్నవించారు. మరోవైపు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారుడైన పెద్దిరాజు 2014లోనే చందానగర్‌లో రేవంత్ రెడ్డిపై ఇలాంటిదే ఒక ఫిర్యాదు చేశారని, అయితే సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ కేసును కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. అనంతరం 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పెద్దిరాజు మళ్లీ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో విచారించిన ఎనిమిది మంది సాక్షుల వాంగ్మూలాల ప్రకారం కూడా రేవంత్ రెడ్డి సంఘటనా స్థలంలో లేరని వారు చెప్పిన విషయాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదనలు పూర్తి కావడంతో, హైకోర్టు ఈ పిటిషన్‌పై తన తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు ఉత్తమం

(మొదటిపేజీ తరువాయి)

మల్లన్న సాగర్, తిప్పారం రిజర్వాయర్ వినియోగించుకోవచ్చని అన్నారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మిస్తే విద్యుత్ భారం ఏడాదికి కేవలం రూ.రెండువేల కోట్లు కానుండగా, కాళేశ్వరంతో అవుతున్న ఏడాది కి రూ.10వేల కోట్ల విద్యుత్ భారం తప్పుతుందన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో అవినీతి చోటు చేసుకుందనేది నిజమని, ప్రాజెక్టు ఇంజినీర్లపై ఏసీబీ దాడులతో బయటపడుతున్నాయన్నారు. అయితే ఏమేరకు అక్రమాలు జరిగాయన్నది విచారణ సంస్థలు నిగ్గు తేల్చుతాయని ఓ ప్రశ్నకు కూనంనేని జవాబు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి నష్టం చేకూర్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మిస్తున్న బనక చర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. వరద జలాలపై తెలంగాణకు సైతం హక్కు ఉంటుందని, ఇందుకు సంబంధించి వాటాను తేల్చకుండా ఏపీ ఏకపక్షంగా ప్రాజెక్టును ఎలా నిర్మిస్తుందని ప్రశ్నించారు. రూ.85వేల కోట్ల భారీ వ్యయంతో తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును ఏపీ రైతు సంఘాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల సీఎంలు కూర్చుని సముద్రంలో కలిసే మూడువేల టీఎంసీల్లో ఎవరి వాటా ఎంతో తేల్చుకున్న తర్వాతే కట్టుకోవచ్చు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఎకరాలకు సాగు నీరు అందించారో శ్వేతపత్రం విడుదల చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ వేగవంతం చేసి సాధ్యమైనంత తర్వగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. అంతర్జాతీయ దౌత్య సంబంధాలను పటిష్ట పర్చడంలో ప్రధాని మోదీ పూర్తిగా విఫలమయ్యారని సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. పహల్గాంలో దాడికి పాల్పడిన ఒక్క ఉగ్రవాదిని కూడ కేంద్రం అరెస్టు చేయలేకపోయిందన్నారు.

పెట్టుబడులకు వేదిక తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని, భాషా సమస్య లేదని, మానవ వనరులు లభిస్తాయని చెప్పారు. అన్నింటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఉందని భట్టి విక్రమార్క అన్నారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేశామన్నారు. ఆ పాఠశాల నిర్వహణకు సిద్ధమని కార్పొరేట్ కంపెనీలు 15 రోజుల వ్యవధిలోనే హామీ ఇవ్వడం గమనార్హం అన్నారు. గతంలో నిర్మించిన 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి ఫలితాలు కార్పొరేట్‌లకే పరిమితం కారాదన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలను ప్రభుత్వానికి విరాళాలిచ్చే సంస్థలుగా కాకుండా భాగస్వాములుగా చూస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. దీర్ఘకాలిక అభివృద్ధికి మార్గదర్శకులు అవుదామంటూ కార్పొరేట్లకు ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజా సంస్థలతో కలిసి పని చేయాలని సూచించారు. ప్రజల నైపుణ్యత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా ప్రయత్నం జరగాలన్నారు. ప్రతి సీఎస్‌ఆర్ పథకం ప్రజల స్వావలంబనకు దోహదం కావాలని భట్టి విక్రమార్క తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు సురేశ్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల పాల్గొన్నారు.

సన్నాలకు బోనస్... బోగస్సే

(మొదటిపేజీ తరువాయి)

రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం శోచనీయమని అన్నారు. తక్షణమే సన్నాల బోనస్ డబ్బులతో పాటు పొద్దుతిరుగుడు రైతులకు డబ్బులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను గోస పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, ప్రతీచోట రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోందని, రుణమాఫీ 50 శాతం రైతులకి కూడా అందలేదని, పోయిన వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టగా, యాసంగిలో రైతు భరోసా సగం మందికి కూడా ఇవ్వలేదని తెలిపారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. యాసంగిలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని దుస్థితి అన్నారు.

జనావాసాలపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

అపార్టుమెంట్లు, కార్యాలయాల సముదాయాలు, పారిశ్రామిక ప్రాంతాల సమీపంలో దాడులను ఇరాన్ జరిపిందని ఇజ్రాయిల్ చెప్పింది. క్లస్టర్ బాంబులతో కూడిన క్షిపణులను ఇరాన్ ప్రయోగిస్తోందని ఆరోపించింది. ఇలాంటి క్షిపణి వార్‌హెడ్ 7 కిమీల ఎత్తులో పేలి 20 చిన్న మందుగుండు సామగ్రిగా విడిపోయి కొన్ని ప్రాంతాల్లో పడినట్లు హోమ్ ఫ్రంట్ కమాండ్ తెలిపింది. ఇరాన్‌కు చెందిన ఇతర బాలిస్టిక్ క్షిపణుల కంటే ఈ క్లస్టర్ బాంబు క్షిపణులతో ముప్పు ఎక్కువని కలిగిస్తాయని టెల్‌అవీవ్ అధికారి తెలిపారు. ఈ క్షిపణుల్లో ఒకటి అజోర్ పట్టణంలోని ఓ నివాసాన్ని తాకిందని, ఇందులోని కొన్ని బాంబులు పేలలేదని అధికారులు తెలిపారు. అలాంటివాటిని గుర్తిస్తే వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని ప్రజలను హెచ్చరించారు. యుద్ధ తీవ్రతను పెంచేందుకు ఈ ఆయుధాలను ఇరాన్ ఉపయోగిస్తుందన్నారు. కాగా, 2008లో 111 దేశాలతో సహా 12 ఇతర సంస్థలు క్లస్టర్ బాంబుల ఉత్పత్తి, నిల్వ, బదిలీ, వాడకంపై అంతర్జాతీయంగా నిషేధించినట్లు తెలిపే పత్రంపై సంతకం చేశాయి. ఇరాన్, ఇజ్రాయిల్ మాత్రం అందుకు నిరాకరించాయి.

అమెరికాతో చర్చించే ప్రసక్తే లేదు: ఇరాన్

ఒక వైపు దాడులకు మద్దతిస్తూ, మరోవైపు చర్చిద్దామనడం అమెరికా ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఇరాన్ మండిపడింది. అమెరికాతో అణు చర్చలకు తావులేదని మరోమారు స్పష్టంచేసింది. దీంతో రెండు వారాల్లోగా దాడులపై నిర్ణయిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామంతో ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ట్రంప్ మాట్లాడుతున్నారని, దీంతో మా దేశంపై దాడుల్లో ఆయన ప్రమేయం ఉందని స్పష్టమవుతోందని అన్నారు. యుద్ధం ఆపాలని ప్రపంచ దేశాల నేతలు కొందరు పిలుపునిచ్చినట్లు తెలిపారు. తమది ఆత్మరక్షణ మాత్రమేనని అరాగ్చీ స్పష్టంచేశారు.

కొత్త రివల్యూషనరీ గార్డ్ నియామకం

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా మాజిద్ ఖాదేమి నియమితులయ్యారు. ఇటీవల దాడుల్లో కీలక సైన్యాధికారులను ఇరాన్ కోల్పోయిన క్రమంలో ఈ నియామకానికి ప్రాధాన్యత ఏర్పడింది.

ట్రంప్ ఆదేశాల కోసం ఆగలేం: నెతన్యాహు

ఇరాన్ అణు స్థావరాలపై దాడికి అమెరికా సిద్ధమవుతున్న క్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. దాడులు చేసేందుకు అమెరికా ఆదేశాల కోసం ఆగలేమని అన్నారు. ఇరాన్‌లోని అణు కేంద్రాలన్నింటిని ఇజ్రాయిల్ సమర్థంగా ధ్వంసం చేయగలదన్నారు. ఫోర్డ్‌లోని భూగర్భ అణుకేంద్రంతో సహా అణు స్థావరాలపై దాడి చేయనున్నట్లు తెలిపారు. ఇరాన్‌పై దాడిలో కలిసి వస్తారో లేదో ట్రంప్ నిర్ణయించుకోవాలని అన్నారు. తనకు ఇజ్రాయిల్ ప్రయోజనమే ముఖ్యమని నెతన్యాహు చెప్పారు. ఇరాన్‌పై సైనిక చర్యలు చేపట్టడంపై ట్రంప్ మరో రెండు వారాల్లో నిర్ణయించే అవకాశమున్నట్లు శ్వేతసౌధం వర్గాలు వెల్లడించాయి.

ఖతార్ నుంచి అమెరికా సైనిక విమానాల తరలింపు!

ఇరాన్‌పై ఇజ్రాయిల్ భీకర పోరుకు అమెరికా మద్దతు, త్వరలో సైనిక చర్యలకు ఆదేశాలిచ్చే అవకాశాల క్రమంలో ఖతార్ వైమానిక స్థావరం నుంచి ఒక్కొక్కటిగా అమెరికా సైనిక విమానాలు అదృశ్యమవుతుండటంపై అంతర్జాతీయ మీడియాతో కథనాలు వెలువడ్డాయి. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఈ విమానాలను తరలించినట్లు పేర్కొన్నాయి. రెండు వారాలలో 40 విమానాలు ఆ చిత్రాల్లో నుంచి కనిపించకుండా పోయాయని వార్తా కథనాలు తెలిపాయి. వీటిని ఇరాన్‌పై దాడుల కోసమే అమెరికా తరలిస్తున్నట్లు అభిప్రాయాలు ఉన్నాయి. ఈనెల 5న 'ప్లానెట్ ల్యాబ్స్' విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలలో అల్ ఉదీద్ ఎయిర్ బేస్ వద్ద 40 సైనిక విమానాలు కనిపించాయి. వీటిలో హెర్క్యులస్ సీ-130 వంటి రవాణా విమానాలు, నిఘా విమానాలు ఉన్నాయి. అయితే 19వ తేదీన విడుదలైన చిత్రంలో మూడు విమానాలు మాత్రమే కనించాయి' అని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు దగ్గరగా ఉండటంతో అల్ ఉదీద్ ఎయిర్ బేస్‌లోని విమానాలను అమెరికా తరలించివుండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాంస్కృతిక ఆధిపత్యానికే...

(మొదటిపేజీ తరువాయి)

హిందీ-హిందూ- హిందూస్థాన్ వర్షన్‌కు అనుకూలంగా లేని ప్రతి ఒక్క భాషపై దాడి అని వక్కాణించారు. భాష అనేది సాధికారికతకు మాధ్యమమే తప్ప ఆధిపత్యానికి, అవమానానికి కాదని అన్నారు. ఇటువంటి బెదిరింపులను తీవ్రంగా ఖండించాలని రాజా పిలుపునిచ్చారు. దేశంలోని భాషా వైవిధ్యతను దెబ్బతీసి, సాంస్కృతిక ఆధిపత్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ ప్రయత్నాలకు అమిత్‌షా మాటలు అద్దం పట్టినట్లు సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. భారత్‌కు లింక్ లాంగ్వేజ్‌గా ఆంగ్లం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్య, ఉద్యోగావకాశాలకు ద్వారాలు తెరుస్తున్నదన్నారు. ఇలాంటి భాషపై దాడి చేయడమంటే యువకులు, అణగారిన వర్గాల ఆకాంక్షలను దెబ్బతీయడమేనని సంతోశ్ కుమార్ అన్నారు. ఆంగ్లం స్థానాన్ని హిందీతో భర్తీ చేసి సాంస్కృతిక-భాషాపరమైన ఆధిపత్యాన్ని పొందాలనే ఆర్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టుకు అనుగుణంగా అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. బీజేపీకి కావాల్సినది భిన్నత్వంలో ఏకత్వం కాదు... తాము ఆపాదించే ఏకరూపత అని ఎంపీ దుయ్యబట్టారు.

'ఇది ఆంగ్ల భాషపై మాత్రమే దాడి కాదు. హిందీ-హిందూ-హిందూస్థాన్ అనే సంఘ్ విజన్‌కు అనుకూలం కానీ తమిళం, మలయాళం, బెంగాలీ, తెలుగు వంటి ప్రతి ప్రాంతీయ భాషపై ప్రత్యక్ష దాడి' అని అన్నారు. సాధికారికతకు భాష మార్గమని, సైద్ధాంతిక నియంత్రణకు మాధ్యమం కాదన్నారు. సాంస్కృతికపరమైన ఆధిపత్యం కోసం హిందీ భాషను రద్దే ప్రయత్నాలను సీపీఐ బలంగా అడ్డుకుంటుందని సంతోశ్ కుమార్ వెల్లడించారు.

మా హక్కులు వదులుకోం

(మొదటిపేజీ తరువాయి)

వేల ఎకరాలకు మాత్రమే నీరు అందించారని తెలిపారు. ఈ ఏడాదిలో తెలంగాణలో పండిన అత్యధిక పంటలకు కాళేశ్వరం నీళ్లకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్‌రావులే అని రేవంత్ ఆరోపించారు. తెలంగాణ ధాన్యాగారంగా మారేందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో సంబంధం లేదని అన్నారు. జలవివాదాలు తమ విధానం కాదని, చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకుంటామని అన్నారు. జులై ఆరు, ఏడు తేదీల్లో మరోసారి దిల్లీలో పర్యటిస్తామని తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంలో హరీశ్‌రావు ఉన్నారని విమర్శించారు. కేటీఆర్‌కు కిషన్‌రెడ్డి లైజనింగ్ అధికారిగా పనిచేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని మోదీ, అమిత్‌షా అన్నారని గుర్తుచేశారు. క్యాబినెట్ నిర్ణయం తర్వాతే కాళేశ్వరం కట్టారని ఎంపీ ఈటల రాజేందర్ చెబుతున్నారని, ఏది నిజమో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని సీఎం పేర్కొన్నారు. 'మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు మద్దతు కావాలి. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలి. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. బనకచర్లపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. 2016, 2018లో ఏపీ సర్కారు రెండు జీవోలు ఇచ్చింది. వాటి ఆధారంగా వ్యాప్కోస్ 150 పేజీల నివేదిక ఇచ్చింది. గోదావరి-పెన్నా అనుసంధానంలో బనకచర్ల ఒక భాగం. 86 రోజుల్లో 400 టీఎంసీలు తరలించేలా బనకచర్ల డిజైన్ చేశారు. గోదావరిలో 968 టీఎంసీలు వాడే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిది. ఈ వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదు' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

45 రోజుల తర్వాత తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

సూచించింది. దీనికి సంబంధించి రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు మే 30న లేఖలు పంపగా... ఆ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలు దశల్లో చేపట్టే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సీసీటీవీ రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్ విధానాలపై ఈసీ ఆ లేఖలో సూచనలు జారీ చేసింది. సాధారణంగా ఎన్నికలకు సంబంధించిన చట్టాల ప్రకారం ఈ రికార్డింగ్‌లు తప్పనిసరి కానప్పటికీ పారదర్శకత కోసం ఈసీ వీటిని ఓ సాధనంగా వినియోగిస్తోంది.

అయితే, ఇటీవల ఈ రికార్డులను దుర్వినియోగం చేసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, కథనాలు వ్యాప్తి చేస్తున్నట్లు ఎన్నికల సంఘం చెప్పుకొచ్చింది. 'ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఏ వ్యక్తి అయినా 45 రోజుల్లోపు సంబంధిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే వీలుంది. అందువల్ల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, ఫొటోగ్రఫీ డేటాను ఫలితాలు వెలువడిన 45 రోజుల వరకు భద్రపర్చాలి. ఆలోగా సంబంధిత నియోజకవర్గంలో ఓటర్ల తీర్పును సవాల్ చేస్తూ ఎలాంటి పిటిషన్ దాఖలు కాకపోతే ఆ రికార్డింగ్‌లు ధ్వంసం చేయొచ్చు' అని ఈసీ ఆదేశించింది.

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన రికార్డింగ్‌లను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు గతేడాది డిసెంబరులో కేంద్ర చట్టంలో సవరణలు చేసింది. సీసీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌లను బహిరంగంగా తనిఖీ చేయకుండా ఆంక్షలు తీసుకొచ్చింది.

15 రోజుల్లోనే కొత్త ఓటరు కార్డు

ఓటర్లకు కొత్త ఓటరు కార్డులను 15 రోజుల్లోగా డెలివరీ చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తాజాగా ప్రకటించింది. ఇప్పటివరకు ఓటర్లకు ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డ్(ఎపిక్) చేరేందుకు నెలకు పైగా సమయం పట్టేది. ఇకపై కొత్త ఓటర్లకు, ఇప్పటికే ఓటరుగా నమోదై వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి కొత్త ఓటరు కార్డులు 15 రోజుల్లోగా అందనున్నాయి.

ఇందుకోసం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఈసీ తెలిపింది. ఎన్నికల నమోదు అధికారి ఎపిక్ జనరేట్ చేసినప్పటి నుంచి ఓటరుకు పోస్టల్ విభాగం ద్వారా డెలివరీ అయ్యేవరకు ప్రతి దశలోనూ ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది. ఓటర్ ఐడీ కార్డులు సజావుగా డెలివరీ చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈసీఐ నెట్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక ఐటీ మాడ్యూల్‌ను ప్రారంభించింది. ఇది పోస్టల్ విభాగం ఏపీఐతో అనుసంధానమై పనిచేస్తుంది.

మావోయిస్టులపై మారణహోమం నిలిపేయండి: చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర- హైదరాబాద్ : మావోయిస్టులపై జరుగుతున్న మారణహోమాన్ని దేశంలోని పౌర సమాజం మొత్తం ఖండిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర శక్తులు, పౌర హక్కుల సంఘాలు ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ధర్నాలు చేస్తున్నా... శాంతి చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు కోరుతున్నప్పటికీ ... బూటకపు ఎదురుకాల్పులతో వారిని చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ బూటకమని, వీటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2026, మార్చి నాటికి దేశంలో నక్సలైట్లను పూర్తిగా అంతం చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు అనుగుణంగా మోదీ మావోయిస్టుల అంతానికి పూనుకున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు. అంతరాలు లేని సమాజం కావాలని కోరారు.

ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా: మోదీ

భువనేశ్వర్: బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి విషయంలో నవశకం ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. బీహార్ నుంచి ఒడిశా పర్యటనకు వచ్చిన మోదీ...రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. సుపరిపాలన, ప్రజాసేవలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విజయవం తంగా ఏడాది పూర్తి చేసుకుందని చెప్పా రు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని ప్రధాని మోదీ వెల్లడించారు. 'జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేశారు. వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారు. విందులో పాల్గొని చర్చించుకుందామని పిలిచారు. జగన్నాథుడి పుణ్యభూమికి వెళ్లడం నాకు ముఖ్యమని చెప్పా. ఆయన ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించా' అని చెప్పారు. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని తెరవాలన్న ప్రజల డిమాండ్‌ను బీజేపీ ప్రభుత్వం నెరవేర్చిందని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌లో సుపరిపాలనకు చోటు లేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా అవినీతి కేంద్రంగా నిలిచిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో అప్పటి ప్రభుత్వం విఫలమైందన్నారు. చాలా ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని, క్రమంగా వాటిని అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్‌ఏ) ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది.

అయితే, వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి కారణాలతో పలుమార్లు వాయిదా పడింది. భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటిస్తారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

కలెక్టర్ దివాకర్ టి.ఎస్.

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : నేడు గిరిజన భవనంలో దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలకు ప్రజలందరూ పాల్గొని విజయ వంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించు కోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా కేంద్రంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఉదయం ఏడు గంటలకు జరగనున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలు గిరిజన భవనం ములుగులో జరుగుచున్నాయని, ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అధికారులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు భాగస్వాములు కావాలని, ప్రతిరోజు యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు సామూహికంగా యోగ ప్రాణాయామ, మెడిటేషన్ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

అయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - తొర్రూర్ : ఆయిల్ పామ్ సాగలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని హార్టికల్చర్ శాఖ అధికారులు మానస రైతులకు సూచించారు. శుక్రవారం తొర్రూరు మండలం అమ్మాపురం, ఖానాపురం గ్రామంలో అయిల్ ఫాం పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ప్రస్తుతం సాగు గెల దశలో ఉందని తగినంత నీటి పంపిణీ, శుద్ధమైన నేరుళ్ళ వినియోగం, నియమిత ఎరువుల వాడకం, పురుగు వ్యాధుల నియంత్రణకు బోరాన్ మెగ్నీషియం ద్వారా తగిన రీతిలో ప్రామాణిక మార్గదర్శకాలను అమలు చేయాలని చెప్పారు. ఆయిల్ పామ్ తోటలకు తగినపాటి సంరక్షణ కల్పిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం పంట కొత్త దశలోన ఎలుకలు ఆశించే అవకాశం ఉందని వాటి నివారణకు అల్యూమినియం ఫాస్ఫేట్ గుళికలను మందులను వినియోగించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడంలో భాగంగా రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెద్దపల్లి, సింగరేణి : నిరంతర అభి వృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ అన్నారు. శుక్రవారం ఆయన గోదావరి ఖని ఎన్టిపిసి 3,4,5, డివిజన్లలో 2 కోట్ల ఖర్చుతో రోడ్లకు మున్సిపల్ అధికారులు, స్థానిక కౌన్సిలర్లు, నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పోరేషన్‌లో 900 కోట్ల రూపాయలతో రామగుండంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుదెల శ్రీధర్ బాబుల సహకారంతో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు పొందుతూ పనులు చేపట్టామని అన్నారు. అదేవిధంగా సింగరేణి మేడిపల్లి ఓసిపి వద్ద 500 మెగా వట్ల పంప్ హౌస్ స్టోరేస్‌తో జల విద్యుత్ జరిపే యూనిట్ను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. వీటితో పాటు రామగుండం థర్మల్ కేంద్రంలో 800 మెగావట్ల యూనిట్ ఏర్పాటు కొరకు కృషి చేస్తున్నానని అన్నారు. కొత్త విద్యుత్ యూనిట్లు ఏర్పాటు జరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆసిఫ్ పాషా, సంబంధిత మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తుల గడువు పొడిగించాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : భూ భారతి సదస్సును గ్రామ గ్రామాన నిర్వహించడం హర్షణీయమని, దురదృష్టవశాత్తు అట్టి సదస్సులో పాల్గొన లేకపోయిన రైతాంగానికి మరో మూడు రోజుల గడువు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ విజ్ఞప్తి చేశారు. భూ భారతి సదస్సులో పాల్గొలేకపోయిన నిరుపేద రైతుల, వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో స్థానిక నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జరిగిన భూభారతి సదస్సులు నిర్వహించినప్పటికీ ఆరోగ్య కారణాల వల్ల మరి ఇతర కారణాల వల్ల దరఖాస్తు చేసు కోలేకపోయిన వివిధ గ్రామాల్లోని రైతులకు మరొక మూడు రోజుల గడువు పెంచి అందరి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. సమయానికి గ్రామాల్లో లేకపోవడం, వల్ల మాత్రమే దరఖాస్తు చేసుకోలేకపోయారని కావాలని ఏ రైతు కూడా నిర్లక్ష్యం చేయడని అధికారులు గుర్తించాలని అందువల్ల గ్రామాల్లో మిగిలిపోయిన రైతాంగానికి మరొక అవకాశం కల్పించాలని కోరిన వెంటనే సంబంధితపై అధికారులతో స్థానిక తహసిల్దార్ సంప్రదించి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఇంకా కొన్ని వందల మంది రైతులు దరఖాస్తు చేసుకోక మదన పడుతున్నారని వారి ఈతి బాధలు గమనంలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతాంగానికి న్యాయం చేయాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు జిల్లా మంత్రికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంద సైదమ్మ, బొల్లెద్దు శైలజ, మహమ్మద్ ఖాసిం, కే శంకర్ బొలిశెట్టి నాగయ్య, బొలిశెట్టి రమేష్, దుద్దూరి సైదమ్మ, రేఖ లలిత, దండగల బుజ్జమ్మ, కట్కూరు జానకి, రాములు, మాలోతు సైదా, మాలోతు కృతి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : మండల వ్యాప్తంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా జరిగేలా చూడాలని ఎంపీడీవో జి సురేందర్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రావడంతో లబ్దిదారులను పనులు వేగవంతంగా పిల్ల నిర్మాణం చేపట్టాలని సూచించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల సమయంలో ప్రభుత్వ చూసిన మేరకే ఇసుక పనులు అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల కలల వైపు ఇందిరమ్మ ప్రభుత్వం పయనం...

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : పేదల కలలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం పయనిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం అశ్వరావుపేట నియోజక వర్గంలోని చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకల పల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో 130 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా సునావత్ పార్వతి ఇంటి పనులకు మంత్రి భూమి పూజ నిర్వహించారు. అనంతరం తిప్పనపల్లి గ్రామంలో కోటి 70 లక్షల వ్యయంతో నిర్మించను న్న అంతర్గత సిసి రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం ఐదు హై లెవెల్ బ్రిడ్జి పనులు, సీతాయి గూడెంలో రూ. 3.20 కోట్లు, అన్నపురెడ్డిపల్లి మండలం కంపగూడెం గ్రామం వద్ద రూ. 3.25 కోట్లు, ములకలపల్లి మండలం చింతలపాడు వద్ద రూ. 2.10 కోట్లు, పాతూరు గ్రామం వద్ద రూ. 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హై లెవెల్ బ్రిడ్జ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కల సహకారం చేసేందుకు గాను మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. దీనిలో భాగంగా అశ్వరావుపేట నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా గిరిజన ప్రాంతానికి 1000 అదనపు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. హౌసింగ్ పిడి శంకర్, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విచారణలో ఉన్న ఇళ్ల స్థలాల కేసుల్లో జోక్యం చేసుకుంటే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న సివిల్ కేసుల్లో పంచాయతీ కార్యదర్శులు జోక్యం చేసుకోకూడదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వేళ ఎవరైనా పంచాయతీ కార్యదర్శి ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు సివిల్ వివాదాల్లో, ముఖ్యంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో జోక్యం చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కొన్ని సందర్భాల్లో, న్యాయస్థానాల్లో విచారణ జరుగుతుండగానే పంచాయతీ కార్యదర్శులు వివాదాస్పద స్థలాల్లో ఇళ్లలో ఇంటి నంబర్లు కేటాయించడం లేదా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల గ్రామ స్థాయిలో న్యాయపరమైన సంక్లిష్టతలు పెరిగి, వివాదాలు మరింత తీవ్రమవు తున్నాయని తెలిపారు. ఈ రకమైన చర్యలు అనధికారికమైనవిగా, పరిపాలనా హోదాకు అతీతమైనవిగా పరిగణించబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇవి న్యాయ ప్రక్రియలకు భంగం కలిగించడమే కాకుండా, పంచాయతీరాజ్ శాఖకు, జిల్లా యంత్రాంగానికి అనవసరమైన న్యాయ పరమైన సమస్యలను తెచ్చిపెడుతున్నాయని, అలాగే ప్రజల నుండి విమర్శలను తెచ్చిపెడతాయని పేర్కొన్నారు. అందువల్ల పంచాయతీ కార్యదర్శులు వివాదాస్పద ప్రాంతాల్ల ఇళ్లలో లేదా లిటిగేషన్ ఉన్న సందర్భాల్లో ఇంటి నంబర్లు లేదా ఆస్తి సంబంధిత సర్టిఫికెట్లు జారీ చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ఇలాంటి అనధికారిక చర్యలను జిల్లా యంత్రాంగం ఇకపై సహించబోదని కలెక్టర్ హెచ్చరించారు.

ఈ విషయంపై ఎంపిడిఓలు, ఎంపిఓలపై సూచనలపై పంచాయతీ కార్యదర్శులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరిగితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌తో పేదలకు సొంతింటి కల సాధ్యం

విశాలాంధ్ర - తొర్రూరు : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల సాధ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు అన్నారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో 111 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకొనే వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నదని చెప్పారు. నిరుపేదలు ఆత్మ గౌరవంతో జీవించాలనే ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామని, వారి కలను సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో సాకారం చేస్తున్నామని స్పష్టం చేశారు. అర్హత ఉంటే ఎలాంటి సిఫారసులు అవసరం లేదన్నారు. రాబోయే నాలుగున్నరేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పుట్టిన బిడ్డ నుంచి పెళ్లి చేసి అత్తారింటికి పంపేవరకు ఏదో పథకం కింద లబ్ది చేకూరుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, మంగళ పెల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, ధరావత్ సోమన్న, వెంకటాచారి, దొంగరి రేవతి శంకర్, నర్కుటి గజానంద్, తూనం శ్రవణ్ కుమార్, భూసాని రాము, నల్లపు రాజు, అలువాల సోమయ్య, ముద్దసాని సురేష్, బిజ్జాల అనిల్, రాజేష్ యాదవ్, వెలుగు మహేశ్వరి, కల్లూరి కుషాల్, మనోహర్, చిదిరాల రవి, మహేష్ యాదవ్, భరత్, మధు, చంటి తదితరులు పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ల పంపిణీ : ఎస్ఐ

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలో, శు క్రవారం స్థానిక ఎస్ఐ వెంకటేష్ గుర్రెవుల గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. మత్తుకు బానిసై తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగుతూ స్వామి వివేకానంద లాంటి మహాత్ములను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలను అవరోధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకం : ఎస్ఐ

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలో ఎస్ఐ ఇనిగాల వెంకటేష్ చొరవతో బుట్టాయగూడెం ప్రధాన రహదారిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాల కీలకమని, మీ పరిసర ప్రాంతాలలో ఇవి ఏర్పాటు చేసుకోవడం వలన అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు, సహాయపడుతయని, నేర పరిశోధనలలో కనిపించని నాలుగవ సింహం ల ప్రమాదాలు చేసి పారిపోయే వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చి ప్రతి గ్రామంలో, ప్రధాన కూడళ్లలో, కిరాణ షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి, మండల ప్రజలు, యవత, వ్యాపారస్తులు సహకరించాలని తెలిపారు.

రైతు భరోసా నిధులు మంజూరు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : రైతు భరోసా పథకంలో భాగంగా జిల్లాలో 1 లక్ష, 93 వేల 851 మంది రైతులకు నిధుల మంజూరు అయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయ నిర్మల తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడిఏలు శ్రీనివాసరావు, మురళిలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలో రైతులకు రైతు భరోస పథకం క్రింద 2025 వానాకాలం సీజనుకు గాను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు అనగా జూన్ 20 వరకు అందించిన పెట్టుబడి సహాయం ఎకరానికి 6000 చొప్పున రూ. 202.49 కోట్లు, 1,93, 851 మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. దీనిలో 22108 మంది ఆర్‌వోఎఫ్ఆర్ రైతులకు 30.24 కోట్లు రూపాయలు పెట్టుబడి సహాయం అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించిన పెట్టుబడి సహాయం రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, కలుపు మందులు కొనుగోలుకు సక్రమంగా వినియోగించుకోవడానికి అందించడం జరిగిందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల సాకారం :ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - కొమురం భీం : కాగజ్‌నగర్ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని, అది కేవలం ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యం అవుతుందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నంబర్ 05,14,15,29,27 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్సీ దండే విఠల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిరుపేదల సొంతంటి కల సాకారం ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఎవరైనా దళారులు చేతివాటం ప్రయోగిస్తే కఠినచర్యలు ఉంటాయని అని హెచ్చరించారు. ఇండ్లు లేని ప్రతి నిరుపేద కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు తీపి కబురు

విశాలాంధ్ర - చర్ల : డీఎస్సీ ఉపాధ్యాయులకు వేతన బిల్లులను మంజూరు చేయాడంతో ఆనందం వ్యక్తమౌతుంది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ తీపి కబురు అందజేశారని పీఆర్టియు చర్ల మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్ఎస్ రవికుమార్, వీరభద్రం శుక్రవారం తెలిపారు. ఈ మేరకు మెమో నెంబర్ 530/210/టి.ఎఫ్.ఆర్ /2024 ద్వారా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గతేడాది (2024) అక్టోబర్ 10వ తేదీ నుండి వేతనాల బిల్లులను అనుమతించాలని ట్రెజరీ అధికారులను ఆదేశాలు జారీ చేశారని వివరించారు. ఎంతో కష్టపడి డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు అక్టోబర్ 10, 2024 నుంచి వేతనాలు, సర్వీస్ ఇప్పించటానికి కృషి చేసిన ఎంఎల్ఎస్.శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, దామోదర్ రెడ్డిలకు పీఆర్టియు చర్ల మండల శాఖ కృతజ్ఞతలు వ్యక్తం చేసింది. రాష్ట్ర జిల్లా కార్యద ర్శులు వేణు, శ్రీనివాస్, గురుమూర్తి, కేహెచ్ కేఎస్ఎన్.రాజు, యుపీ.రాజు, పున్నం సారయ్య, మీడియం రామకృష్ణ, రామయ్య తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

ఘనంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల టౌన్ ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ, సివిల్ సప్లై శాఖ కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి 63వ పుట్టినరోజు వేడుకలను నేరేడుచర్ల కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనతం చిన్న వెంకటరెడ్డి మున్సిపల్ ఎక్స్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి నేరేడుచర్ల టౌన్ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి కొనతం చిన్న సీతారాం రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ అలక సరిత సైదిరెడ్డి మార్కెట్ డైరెక్టర్ మచ్చ శ్రీనివాస్, కత్తి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లంచెట్ల రమేష్ బాబు మాజీ సర్పంచులు ఆకారపు వెంకటేశ్వర్లు జంగిలి వెంకటేశ్వర్లు చింతమల్ల సైదులు మాజీ కౌన్సిలర్లు రణపంగు నాగయ్య పాండు నాయక్, కొనతం రాంరెడ్డి, నూకల వెంకట్ రెడ్డి, కొనతం నర్సిరెడ్డి, తోట శ్రీనివాస్, సంకలమర్ది లీలా మనిషా రెడ్డి, భార్గవ్ సైదులు, వీరబాబు, గంట సైదులు, మచ్చ రవి, కార్తీక్ వెంకన్న, శ్రీకాంత్, సుక్కి గుంటూరు శీను, మాలాద్రి చౌదరి, వెంకట సైదులు, కొండ రాము, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి సాయం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ టి.అనిల్ కుమార్ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. కోటి చెక్కును జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా అందించారు. పోలీస్ శాలరీ ప్యాకేజీ అకౌంట్ ద్వారా యూనిఫాం సర్వీస్ కష్టమర్ల సంక్షేమానికి స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ప్రవేశపెట్టిన స్కీం ద్వారా వచ్చిన నగదును ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ ఆంజనేయ రమేష్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు సమక్షంలో ఎస్పీ ఈ చెక్కును అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశానికి సేవ చేస్తున్న కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ స్కీం పోలీస్ శాఖలోని ప్రతి ఉద్యోగికి చాలా ప్రయోజనకరమన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల మధ్య ఘర్షణలను సృష్టిస్తున్న సివిల్ అధికారులు

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి కొత్తగూడెం కార్పొరేటు ఇల్లందు బంగ్లోస్ వద్ద జరుగుతున్న ఆందోళన, నిరసనలకు సింగరేణి సివిల్ అధికారులే బాధ్యులని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. అత్యంత బాధ్యతా రాహిత్యంగా తప్పుడు పద్ధతిలో టెండర్లను పిలవడం వల్ల రైటర్ బస్తీ, బంగ్లోస్ కాంట్రాక్ట్ కార్మికులు మధ్య ఘర్షణలు సృష్టించడానికి సివిల్ అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. తమ వైఖరిని మార్చుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కిష్టాఫర్‌లు హెచ్చరించారు. శుక్ర వారం బంగ్లోస్ వద్ద సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు వేరే ప్రాంతాల నుంచి వస్తున్న పోటీ కార్మికులను అడ్డుకొని నిరసన తెలియజేశారన్నారు. ఇందులో ఏఐటియుసి నాయకులుగా తాము పాల్గొని మద్దత్తు ఇచ్చినట్లు తెలిపారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులకు రిప్రజెంటేషన్ చేసినప్పటికీ పట్టించు కోకుండా తప్పుడు పద్ధతిలో వాహనాలలో పోటీ కాంట్రాక్ట్ కార్మికులను దొంగ తనంగా తీసుకురావడం సరికాదన్నారు. కార్మికుల మధ్య ఘర్షణ సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. గత వారం రోజుల నుండి కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ సివిల్ అధికారులు నిర్లక్ష్యం వివరించడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన పోరాటాలకు సివిల్ అధికారులే పూర్తి బాధ్యత వహించాలాన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి. రంజిత్, కృష్ణమూర్తి, రాజు, శంకర్, నాగమ్మ, సురేష్, ఆదిలక్ష్మి, సుశీల, విజయ్ సుజాత, మాధవి, కళ్యాణ్, లక్పతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో అంతర్జాతీయ యోగా ర్యాలీ

విశాలాంధ్ర - భద్రాచలం : పట్టణంలో జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం జీయర్ మఠం, వికాస్ తరంగణి, శివానంద ఆశ్రమం సంయుక్తంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్ మాట్లాడుతూ యోగా అంటే వ్యాయామ సాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపమన్నారు. ఇది హిందూత్వ అధ్యాత్మిక సాధనలలో ఒక భాగమని మోక్షసాధనలో భాగమైన ధ్యానం, పరమానంద ప్రాప్తి లాంటి అధ్యాత్మికపరమైన సాధనలకు పునాది అన్నారు. దీనిని సాధన చేసే వాళ్ళను యోగులు అంటారని తెలిపారు. బౌద్ధ, జైన, సిక్కుమతం మొదలైన ధార్మిక మతాలలోనూ ఇతర యోగ ప్రాధాన్యత కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమల రాజశేఖర్, కార్యదర్శి సిద్దారెడ్డి, కోశాధికారి రామారావు, రామలింగేశ్వరరావు, పరిమి సోమశేఖర్, హరిచంద్ర నాయక్, వెంకటాచారి, సీతామహాలక్ష్మి, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో పరిహాసమాడుతున్న ప్రైవేటు ఏజెన్సీ

కార్యాలయ అడ్రస్ కోసం అభ్యర్థుల పడరాని పాట్లు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : నిరుద్యోగులతో జిల్లాలోని ఒక ప్రయివేట్ ఏజెన్సీ పరిహాసమాడుతుంది. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలను ఈ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం చేపడుతుంది. ప్రభుత్వ విధాన లోపాలను అడ్డుపెట్టుకున్న ఈ ఏజెన్సీ తన ఇష్టారాజ్యాన్ని కొనసాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఏమైనా సందేహాలు ఉండి వివరాలు అడిగితే జవాబు చెప్పకపోగా నిర్లక్ష్యంగా "మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి... ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి" అంటూ కరుటుగా ఏజెన్సీ బాధ్యులు సమాధానం చెప్పడంతో నిరుద్యోగులు, పత్రిక విలేకరుల సైతం అవాక్కవుతున్నారు. పాల్వంచ కేంద్రంగా ఉన్న శ్రీ సాయిరాం ఏజెన్సీ పేరా ఔట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు ఇప్పటికే చాలా జరిగాయి. తాజాగా ఇటీవల జిల్లాలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల / కళాశాలల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆ ఏజెన్సీబాధ్యులు నోటిఫికేషన్ జారీ చేశారు. పిజిటి ఇంగ్లీష్, పిజిటి తెలుగు, డిప్యూటీ వార్డెన్, టి జి టి ఉర్దూ, స్టాఫ్ నర్స్, అటెండర్ ఒక్కో పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్థంతో నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నోటిఫికేషన్ ఏ తారీకులో విడుదల చేసారో, ఏ తారీకున చివరి తేది నో కనీసం స్పష్టం చేయకపోవడం గమనార్హం. శనివారం చివరి తేదీ అంటూ ఆ నోటిఫికేషన్లో ప్రస్తావించారు.

శనివారం అంటే ఏ తేదినో స్పష్టం చేయలేదు. కాగా జిల్లాలోని కొందరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు పాల్వంచ వేళ్లిన కొందరు అభ్యర్థులు గల్లీలు పట్టుకొని తిరిగిన అడ్రస్ దొరకని పరిస్థితి ఉందని విశాలాంధ్రకు వెళ్లడం వెల్లడించారు. శుక్రవారం ఒక అభ్యర్థిని దరఖాస్తు చేసుకునేందుకు అడ్రస్ కోసం వెళ్లి వెతికి వేసారి ఏజెన్సీ నోటిఫికేషన్ లో ఉన్న ఫోన్ నెంబర్లకు కాంటాక్ట్ చేయగా ఈరోజు సమయం అయిపోయిందనిచెప్పారని ఆ అభ్యర్థిని వెల్లడించింది. ఇదే పరిస్థితి ఎదురైనట్లు కొందరు అభ్యర్థులు చెప్తున్నారు. కార్యాలయాన్ని ఒక చిన్న ఇంట్లో ఏర్పాటు చేసి అభ్యర్థులకు అడ్రస్ దొరక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆరోపణలు వస్తున్నాయి. గతంలోనూ ఈ ఏజెన్సీ చేపట్టిన నియామకాలపై అనేక వివాదాలు ఏర్పడినప్పటికీ జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని చాలామంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగ నియామకాల విషయంలో ఏజెన్సీల బదులు ప్రభుత్వ అధికారులతోనే నేరుగా నియుక్తి చేస్తే జవాబుదారితనం ఉంటుందని అభ్యర్థులు అంటున్నారు. ఏజెన్సీ బాధ్యుడిని విశాలాంధ్ర వివరణ అడుగుతూ దరఖాస్తు చివరి తేది ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించగా ఒక ప్రధాన పత్రికలో అంత ఇచ్చామని అది చూసుకోండి అంటూ చిరాకుగా సమాధానం చెప్పటం గమనార్హం.

సంపాదకీయం

సొంత అజ్ఞానం-సర్వవ్యాప్తం

"ఇంగ్లీషు మాట్లాడే వారు సిగ్గుపడే రోజు త్వరలోనే వస్తుంది." ఈ మాటలు అన్నది కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా. మాజీ ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహోత్రి రాసిన "మై బూంద్ స్వయం, ఖుద్ సాగర్ హూ" గ్రంథాన్ని ఆవిష్కరించే సందర్భాన్ని గురువారం అమిత్ షా ఇంగ్లీషు మాట్లాడే వారిని తృణీకరించడానికి వినియోగించుకున్నారు. ఇంగ్లీష్ మాట్లాడే వారిని అవమానించడం వెనక హిందీని దేశవ్యాప్తంగా విస్తరింప చేయాలన్నది అమిత్ షా ఉద్దేశం కావొచ్చు. అమిత్ షాకు ఇంగ్లీషు రాకపోవడం ఆయన తప్పు కాదు. చాలా మంది రాజకీయ నాయకులకు ఇంగ్లీషు రాకపోవచ్చు. అది వారి లోపమూ కాదు. కానీ ఒక భాషను ఉన్నత స్థానంలో ఉంచడానికి మరో భాషను కించపరిచే ధోరణి మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించలేం. బీజేపీ ఎటూ మతాలవారీగా జనాన్ని విడగొట్టడంలో సఫలమైంది. ఇటీవలి కాలంలో భాష ఆధారంగా కూడా జనాన్ని విడదీయాలని చూస్తోంది. హిందీని మొత్తం దేశం మీద రుద్దడానికి బీజేపీ పన్నిన కుట్రలో అమిత్ షాది పెద్ద పాత్రే. మన దేశంలో మాట్లాడే ఏ ఒక్క భాషనూ అధికార భాషగా మలుచుకోలేకపోయాం. అది సాధ్యం కానందువల్లే అవసరమైనన్నాళ్లు ఇంగ్లీషు వ్యవహారంలో ఉండాలనుకున్నాం. ప్రాంతీయ భాషలను చిన్న చూపు చూసి జాతీయ భాషను పెంపొందింప చేస్తామనుకోవడం ఎవ్వరికీ సాధ్యమయ్యేది కాదు. బహు భాషలు మాట్లాడే దేశాలు ప్రపంచంలో చాలానే ఉన్నాయి. కానీ ఎక్కడా ప్రాంతీయ భాషలను కించపరిచే ప్రయత్నం జరగలేదు. మన దేశంలో ఇంగ్లీషు సమగ్రంగా తెలిసినవారు తక్కువే కావొచ్చు. కానీ 30 నుంచి 40 శాతం మందికి ఎంతో కొంతమేర ఇంగ్లీషుతో పరిచయం ఉంది. తమ పిల్లలను ఇంగ్లీషు మాధ్యమంలో బోధించే పాఠశాలల్లోనే చేర్పించాలనుకునే వారు కేవలం ఉన్నత సామాజిక వర్గాలకు చెందిన లేదా ఆర్థిక వెసులుబాటు ఉన్నవారే కాదు. ఆర్థిక స్తోమత అంతంత మాత్రమైన కుటుంబాలవారు కూడా ఇంగ్లీషు మాధ్యమంలో చదివితేనే తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందనుకునే భావన ఉన్నవారు కూడా ఎక్కువే. ఇంగ్లీషు అంతర్జాతీయ భాష కాకపోవచ్చు. కానీ చాలా దేశాలవారికి ఇంగ్లీషుతో అంతో ఇంతో పరిచయం ఉంది. ఒకప్పుడు ప్రపంచంలోని అత్యధిక దేశాలు బ్రిటిష్ పాలనలో మగ్గినందువల్ల ఇంగ్లీషుతో వ్యవహారం అనివార్యం అయింది. మన దేశంలో దాదాపు 1,369 భాషలు ఉన్నాయని ఓ అంచనా. ఇందులో పది వేలకన్నా ఎక్కువ మంది మాట్లాడే భాషలు 121 ఉన్నాయి. భారత రాజ్యాంగం 22 భాషలను అధికారికంగా గుర్తించింది. జనం తమ నిత్య జీవితంలో వినియోగించే అనేక భాషలకు లిపి లేదు కనక ఆ భాషల్లో సాహిత్యం ఉండదు. హిందీని అధికారభాషగా మలిచే ఆత్రుతలో ఇతర భాషలను చిన్న చూపు చేసే ప్రయత్నాలు, ముఖ్యంగా హిందీని అధికారభాషగా మార్చే ప్రయత్నాలు గతంలోనూ జరిగాయి. అలాంటి ప్రయత్నం జరిగినప్పుడల్లా ఎదురు దెబ్బలే తగిలాయి. జాతీయోద్యమ కాలంలో హిందుస్థానీని జాతీయ భాషగా చేయాలనుకున్నారు. కానీ ఆ ప్రయత్నం కాస్తా హిందీకి పెద్ద పీట వేసే పన్నాగాలు జరగడంవల్ల లక్ష్యం నెరవేరనే లేదు. బీహార్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఎక్కువ మంది హిందీ మాట్లాడతారు. వీటిని హిందీ మాట్లాడే రాష్ట్రాలు లేదా "హిందీ బెల్ట్" అంటున్నాం. హిందీ బెల్ట్ కిందకు రాష్ట్రాలలో కూడా మొదటి భాషగానో, రెండవ భాషగానో హిందీ మాట్లాడేవారు గణనీయంగానే ఉన్నారు. దిల్లీ, చండీగఢ్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోనూ హిందీ మాట్లాడే వారు గణనీయమైన సంఖ్యలోనే ఉన్నారు. ఉత్తరాది వారు ఏ దక్షిణాది భాషనూ నేర్చుకోవడానికి సిద్ధంగా లేరు కానీ దక్షిణాది రాష్ట్రాలు హిందీ నేర్చుకోవాలని బలవంత పెడ్తుంటారు. ఇది జనం మాట్లాడే భాషను గౌరవించకపోవడమే. ఆధునిక ప్రపంచంలో ఒక్క భాష మాత్రమే వచ్చిన వారికి ఏ భాషా రానట్టేనని భాషా శాస్త్రవేత్తలు అంటారు. ఎక్కువ భాషలు తెలిస్తే ఇతర భాషలు మాట్లాడేవారితో సంభాషించడం సులభం అవుతుంది. అది ఏ భాష అనేది ప్రజలు నిర్ణయించుకుంటారు తప్ప ప్రభుత్వాలు రుద్దవలసిన విషయం కాదు.

ఒక వర్గాన్ని ఆదరించడం కోసం ఇతర వర్గాలను అవమానించడమే బీజేపీ అనుసరించే విధానం. ఈ పద్ధతిలోనే మతాల వారీగా జనాన్ని విభజిస్తున్నారు. ఈ విషయంలో బీజేపీ దృష్టి ప్రధానంగా ముస్లింల మీదే ఉంటుంది. ఆ మతం వారు పరాయివారు అయిపోయారు. ఇప్పుడు ఇంగ్లీష్ మీద ద్వేషం పెంచి హిందీని ఉద్ధరించాలని అమిత్ షా లాంటి హ్రస్వ దృష్టిగల వారు ప్రయత్నిస్తున్నారు. హిందీని ఉద్ధరించడం కోసం ఇంగ్లీషును అవమానించడం అర్థరహితం. భవిష్యత్తులో ఇంగ్లీషులో మాట్లాడే వారు అవమాన పడాల్సి వస్తుందన్న అమిత్ షా మాటలు కేవలం ఇంగ్లీషు మీద ద్వేషంతోనే కాదు. ప్రతిపక్షాల మీద దాడి కూడా ఆ మాటల వెనక దాగుంది. మన దేశం, మన సంస్కృతి, మన చరిత్రను అర్థం చేసుకోవడానికి ఏ విదేశీ భాషా సరిపోదు అని కూడా అమిత్ షా అన్నారు. ఆయన చెప్పిన సకల అంశాల మీద లోతైన పరిశోధనలు జర్మన్ లేదా ఇంగ్లీషు భాషలోనే ఎక్కువగా జరిగాయి. మన ప్రాచీన సంస్కృతి గొప్ప దనాన్ని చాటి చెప్పడానికి పదకొండేళ్లుగా మోదీ ప్రభుత్వం, అంతకు ముందు ఆరేళ్ల అటల్ బీహారి వాజ్‌పేయి ప్రభుత్వం చేసిన కృషి నిమిత్తమాత్రమైందే. అలాంటప్పుడు ఇంగ్లీషును తూలనాడినందువల్ల ఒరిగేదేమీ ఉండదు. విదేశీ భాష ద్వారా సంపూర్ణ భారత్‌ను ఊహించడమూ సాధ్యం కాదు అని అమిత్ షా అన్నారు. చర్చ కోసం ఆయన మాట సబబే అనుకుందాం. మరి ఏ భారతీయ భాషలో మన చరిత్రను, సంస్కృతిని, గొప్పతనాన్ని తెలియజెప్పే సమాచారం ఉంది గనక! హిందీలోనూ అలాంటి ప్రయత్నం జరిగిన ఆనవాళ్లు లేవు. సమస్త విజ్ఞానాన్ని భారతీయ భాషల్లో అందుబాటులోకి తేవడాన్ని ఎవరు అడ్డుకున్నారు గనక! చిక్కెక్కడంటే అమిత్ షా భారతీయ భాషల గురించి ఆలోచించడం లేదు. హిందీని అన్ని రాష్ట్రాల మీద, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల మీద రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. మన యువత విదేశాలకు, ప్రధానంగా అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో ఉపాధి సంపాదించుకోవడానికి ఇంగ్లీషు తోడ్పడుతోంది. ఈ విషయంలో చైనా, జర్మనీ దేశాలు ఇబ్బందులు పడ్తున్నాయి. భిన్న భాషలు, భిన్న మతాలు, ఇంకా అనేక భిన్నత్వాలే మన దేశ బలం. దాన్నీ అమిత్ షా హిందీ సీసాలోకి దింపాలని చూస్తున్నారు. అమిత్ షా మాట నమ్మి తమ పిల్లలను హిందీ లేదా మరే ఇతర భారతీయ భాషా మాధ్యమంలోనే చదివిస్తామనుకునే వారు ఎవరైనా ఉన్నారా? లేరు గాక లేరు. ప్రస్తుతానికి విదేశాల్లో ఉపాధి సంపాదించడానికి ఇంగ్లీషే సోపానంగా ఉంది. మనకు లేనిది, రానిది దేశవాసులెవరికి ఉండకూడదని, రాకూడదని వాదించడం కేవలం అమిత్ షా లాంటి వితండవాదులకు మాత్రమే అబ్బే విద్య.

ఎలిజీ ఆన్ బతుకులు

ఎలిజీ రాయడమంటే ఆ శరీరాలతో సహా కాలిపోవడం. ప్రసూతి వైరాగ్యమంటే ఓ వేడుక. శ్మశాన వైరాగ్యమంటే ఓ విషాదం. ఈ రెంటికి మధ్య వెలుగుతూ కాలిపోవడమే జీవితమంటే. చివరి ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడతాయి. అంతకు ముందటి చిత్రాలు అయిన వారిని వెంటాడతాయి. బోయింగ్ బ్లాస్టో, రైలు ట్రాక్ బ్రేకింగో, బస్సు లోయలో పడడమో మనుషుల్ని దూరం చేసే వాహిక. శ్మశానానికి దగ్గరచేసే ఐహిక. వాళ్లు లేరు. రారు. కనిపించరు. మాట్లాడరు. మనల్ని మాత్రం చితాభస్మం సాక్షిగా చిత్రవధ చేస్తారు.

కూలింది విమానం కాదు. ప్రయాణాల మీద నమ్మకం. విహంగంలో కదా చివరి శ్వాస. ఏ అంగమూ గుర్తించలేం. డీఎన్ఏ ఒక్కటే పరిష్కారం. యంత్రం నిజం చెప్పదు. చెప్పజాలదు. మనిషి భృకుటి నుంచి వచ్చినది వినా ఏదీ నిజం కాదు. పగిలింది టైర్లు కాదు. పక్షి రెక్కల చప్పుడూ కాదు. ఓ మరణానికి, జీవికకు మధ్య మరణించింది మృత్యువు మాత్రమే. కారణాలు వెతకాల్సిన సమయంలో అకారణాల దేవులాటలు. సాంకేతికతలో దేశం పురోగతి. చప్పట్లు కొట్టాలి. సంబరాలు చేసుకోవాలి. ఈ అభివృద్ధితో విగత శరీరాలు... ఫినిక్స్ పక్షిలా శరీరాలుగా మారతాయా..! నవ వధువు, ముచ్చటైన ముగ్గురు పిల్లల కుటుంబం... మాజీ ముఖ్యమంత్రి... పరామర్శకు వచ్చి

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

పరారైన దేహం. మృత్యువు ముందు అందరూ భగవద్గీత చదువుకోవాలి. అదొక్కటే మిగులుతుంది చిత్రంగా. ఇదే దైవ లీల అంటాడు ఆస్తికుడు. మృత్యువు నుంచి బయట పడింది మాత్రం నాస్తికుడు. ఆస్తికులు, నాస్తికులు.. ఎవ్వరైనా కావచ్చు. ముందు మనుషులం కదా..! కళ్లముందు నడయాడే ప్రపంచీకులు. ఎవరికి వారే మన్‌కీ బాత్‌లు చెప్పుకోవాలి. పక్క వాడికి వినపడకూడదు. చావుకీ చెవులుంటాయి. గగనతలంలోనే కాదు.. ఇలాతలంలోనూ విహంగాలకు నేత్రాలుండవు. కళ్ల స్థానంలో డబ్బుల కట్టలు.

మనుషులు ముద్దలుగా మారిన... జారిన శకలాలు. నిర్లక్ష్యం ఖరీదు పరిహారమా..! తప్పిదాలతో పరిహాసమా..! ఒకే ఒక్క మృత్యుంజయుడు. 270 మందికి పైగా మృత్యుమూర్తులు. ఆ వైద్య విద్యార్థుల మధ్యాహ్నపు ఆకలి. ముద్ద గొంతులో అడ్డం పడి మరణపు వెక్కిళ్లు. ఓ లక్ష పిడుగుపాటు ప్రకంపనల అగ్ని. ఆకలీ ఆగ్నే. వారి చావు నిప్పుకణిక. ఈ భూమి మీద బ్రతికి ఉండడమంటే ప్రతి క్షణం మరణించడం. ఇక్కడ మరణించడమంటే సదా బ్రతికుండడం. ఫొటోలకు దండలా..! దండలకు ఫొటోలా.. ! చివరి సెల్ఫీ అబద్ధం. మొదట మాట అమూర్తం.

వేదాంతానికి ఊయల కట్టి నిత్యం జోలపాట పాడాల్సిన క్షణం. గొప్పకవి అజంతా అన్నాడు... మనిషి రోడ్డు మీద హఠాత్తుగా మటుమాయం కావడం మృత్యువు అని. కొత్త నిజం తెలిసొచ్చింది. రోడ్డే కాదు ఆకసం కూడా శ్మశాన స్థలే.

ఆమెకు పెళ్లి కుదిరింది. మృత్యువుతోనా...! తాళిబొట్టు నాశిరకం. కట్టకుండానే తెగిపడిన బతుకు గాలిపటం. శ్రద్ధాంజలి ప్రకటించిన ఎయిర్ ఇండియా. ప్రయాణాలపై శ్రద్ధ లేని ఓ నిర్లక్ష్యపు సంతాపం. ఒక్కో దేహానికి "కోటి" విలువ కట్టి "టాటా" చెప్పిన సంజాయిషీ. ప్రతి క్షమాపణకు ఆకలెక్కువ. ఆకలికి క్షమించే గుణం ఉండదు. చివరి ఆకలిది మరీ ఓదార్పులేని గుణం.

కాకుల ఆకలికి ఓ పిండ ప్రదానం. మనుషుల ఆకలికి ఓ ప్రమాదం. తనకు సంబంధం లేని ఓ ప్రమాదానికి బాధ్యుడయ్యాడు ఆనాటి ఓ మంత్రి. ఈనాటి ప్రమాదానికి పచ్చచొక్కా మంత్రికి సంబంధం లేదు. నాడు - నేడు వేరు కదా..! ఈ నవ యువ మంత్రికి చీమ కుట్టదు. తన వరం శాపం అని చీమకు బాగా తెలుసు. మంత్రి రామ్మోహనుడికి ఇంకా బాగా తెలుసు. ప్రమాదంలో కాలకుండా మిగిలిన భగవద్గీత పొత్తంపై ప్రమాణంచేసి మరీ చెబుతారు. అంతా నిజమే చెబుతున్నాను. నాకు తెలీదు. అవును తెలియదు. ఎవరికీ తెలియదు. తెలిస్తే జరుగునా...! తెలియకపోతే ఆగునా...! లాల్చీ జేబులో నిద్రపోతుంది వేదాంతం. మృత్యుశయ్యపై ఎవరెవరి అవయవాలో కలగాపులగం అవుతాయి. మనుషులంతా ఒక్కటే మళ్లీ నిరూపితమవుతుంది శ్మశానంలో. సర్వం బూడిద. బూడిదే సర్వం.

కళ్లు, చెవులు సమస్త అవయవాలు రూపాయలుగా రూపాంతరం చెందుతాయి. ఇక ఇక్కడ పనైపోతుంది. ఓటు వేసి చూపుడు వేలి మీద సిరా చుక్క వేయించుకుందాం. వ్యర్థ జీవులం కదా... పోతూ పోతూ హరిహర వీరమల్లు సినిమా చూసి పోదాం. దారి ఇవ్వండి. నేను ఇప్పుడు ఎయిర్ ఇండియా విమానం ఎక్కాలి.

సీనియర్ జర్నలిస్టు
సెల్: 9129 19929

యోగా ముసుగులో మోదీ రాజకీయం

డీవీవీఎస్ వర్మ
దారి దీపం సంపాదకులు

జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందడి రాష్ట్రంలో ఊరూ వాడా మారుమోగుతున్నది. ఈ ఉత్సవానికి మోదీ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నారు. మోదీ ప్రాపకం కోసం ఉవ్విళ్లూరుతున్న చంద్రబాబు ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత నెల రోజులుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన అంతా యోగా చుట్టూ తిరుగుతున్నది. మంత్రులు, శాసన సభ్యులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ యంత్రాంగం అంతా యోగా కోసం 2 కోట్ల మందిని సమీకరించే పనిలో తల మునకలై వున్నది. ఈ యోగా వెనుక అనేక కోణాలు కనిపిస్తున్నాయి. యోగాలో వ్యాయామం వుంది. ధ్యానం వుంది. ఆధ్యాత్మిక ముక్తి మార్గం వుంది. అంతకుమించి వ్యాపారం వుంది. కార్పొరేట్ల ప్రయోజనాలు వున్నాయి. అంతిమంగా మోదీ స్వార్థ పూరిత రాజకీయం వుంది. మోదీని మెప్పించి తమ పబ్బం గడుపుకోవాలనే రాష్ట్ర రాజకీయం వుంది. ఈ కోణాలను మరుగు పరిచే ప్రయత్నాలు ఎన్ని చేసినా అవి తమదైన రూపంలో ప్రత్యక్షమవుతూనే వున్నాయి. ఇలా బహురూపిగా మారిన యోగా రకరకాల కారణాలరీత్యా వివిధ తరగతుల ప్రజల్ని ఆకర్షిస్తున్నది.

మన సామాజిక ఆర్థికాభివృద్ధి క్రమంలో శారీరక శ్రమ చేయనివారు పెరుగుతున్నారు. గ్రామీణ పేదలు, వస్తూత్పత్తి చేసే పారిశ్రామిక కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు మాత్రమే శారీరక శ్రమజీవులుగా ఉన్నారు వారికి యోగా అవసరం అంతగా లేదు. వివిధ రంగాల మధ్య తరగతి వేతన జీవులు శారీరక శ్రమకు దూరం అయ్యారు. అలాంటి వారిని యోగా ఒక వ్యాయామ సాధనంగా ఆకర్షిస్తుంది. మన సమాజంలో నానాటికి వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. వారు వృద్ధాశ్రమాలలో వున్నా, మరోచోట వున్నా వారికి వ్యక్తిగతంగా శ్రమ చేయడానికి యోగా అనువైన సాధనం అయింది. ఇప్పుడు మన బడి పిల్లలు కూడా వ్యాయామానికి అవసరమైన ఆటపాటలు డ్రిల్లు క్లాసులు లేకపోవడంతో పాఠశాలలు యోగాను ఆశ్రయిస్తున్నారు. అదొక గౌరవ ప్రదమైన శిక్షణగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. అదనపు ఫీజులు చెల్లించి యోగాభ్యాసం చేయిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగులకు యోగాను అవలంబించమని ప్రచారం చేస్తున్నాయి. ఆ ఉద్యోగులు కూడా అది తప్పనిసరి అవసరంగా భావిస్తున్నారు. కార్పొరేట్ యాజమాన్యం తమ ఉద్యోగులకు పని ఒత్తిడి పెంచింది. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని ఆందోళనకు గురిచేసింది. పనిగంటల తగ్గింపు, రిక్రియేషన్ కార్యకలాపాల ద్వారా పని ఒత్తిడి తగ్గించడానికి బదులు వీరికి తాత్కాలిక ఉపశమనంగా యోగాను, ధ్యానాన్ని పరిష్కారంగా వారి ముందు పెట్టి, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడే సాధనంగా యోగాను వినియోగించుకున్నారు. ఇలా శారీరక శ్రమలేని తరగతులు, మానసిక ఒత్తిడికి గురవుతున్న తరగతులకు యోగా తప్పనిసరి అవసరంగా కనిపిస్తున్నది. దీనికి కారణమైన సామాజిక, ఆర్థిక కారణాల నుంచి దృష్టి మళ్లించే సాధకంగా యోగా వినియోగపడుతున్నది. ఈ కారణాలరీత్యా మధ్య తరగతి వేతనజీవులు, వృద్ధులు, పాఠశాల పిల్లలు యోగాను ఎంచుకుంటున్నారు. అలా వారు యోగాను ఆచరిస్తున్నారు. తక్షణ ఉపశమనాన్ని పొందుతున్నారు. అందుకే యోగాను వీరు ఆదరిస్తున్నారు.

యోగా, ధ్యానం పూర్తిగా వ్యక్తిగతమైనవి. అయితే ప్రారంభంలో నేర్చుకునేటప్పుడు మాత్రమే దానికి కొంత మేరకు గురువు అవసరం వుంటుంది. దానికి స్థానికంగా చాలా మంది గురువులు ఉన్నారు. వారు తగు ఫీజుతో శిక్షణ ఇస్తున్నారు. దేనికైనా వ్యాపారం చేయగల నేర్పరితనం మన పెట్టుబడీదారి వ్యవస్థకు వుంది. యోగాను కూడా వారు వ్యాపారం చేశారు. ప్రైవేటు వైద్యం దోపిడీలాగా ఈ ప్రైవేటు యోగా వ్యాపారం కూడా విపరీతమైన దోపిడీకి నిలయం

> ప్రపంచవ్యాప్తంగా యోగా చుట్టూ 86,000 కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నది. దీనికి ఆయుర్వేదాన్ని, గోమూత్రాన్ని జత చేసి మరీ విక్రయిస్తున్నారు. ఇప్పుడు యోగా నేర్చుకోవడానికి ఖరీదైన ఆన్‌లైన్ కోర్సులు వచ్చాయి. దేశంలో ఈ వ్యాపారంలో రాందేవ్ బాబాలు, శ్రీశ్రీ రవిశంకర్ అగ్రభాగాన వున్నారు. మోదీ ప్రభుత్వ ప్రాపకం వున్న బాబాలు. వెయ్యి కోట్లకు పైబడి ఆస్తులను పోగేసుకున్నాయి.

అయింది. ప్రపంచవ్యాప్తంగా యోగా చుట్టూ 86,000 కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నది. దీనికి ఆయుర్వేదాన్ని, గోమూత్రాన్ని జత చేసి మరీ విక్రయిస్తున్నారు. ఇప్పుడు యోగా నేర్చుకోవడానికి ఖరీదైన ఆన్‌లైన్ కోర్సులు వచ్చాయి. యోగా చెయ్యడానికి మాట్స్ వ్యాపారం వచ్చింది. యోగా దుస్తుల వ్యాపారం జోరుగా సాగుతున్నది. దేశంలో ఈ వ్యాపారంలో రాందేవ్ బాబాలు, శ్రీశ్రీ రవిశంకర్ అగ్రభాగాన వున్నారు. వారు సాధారణ బాబాలు కాదు. మోదీ ప్రభుత్వ ప్రాపకం వున్న బాబాలు. వీరి ప్రమేయంతో నడుస్తున్న సంస్థలు వెయ్యి కోట్లకు పైబడి ఆస్తులను పోగేసుకున్నాయి. యోగాను కార్పొరేట్ వ్యాపారంగా నడుపుతున్నారు. దీనిని మోదీ రాజకీయంతో జతచేసి మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరింప చేసుకుంటున్నారు. మోదీ ఏ నినాదం ఇచ్చినా, ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో రాజకీయం వుంటుంది. స్వప్రయోజనం వుంటుంది. యోగాకు ప్రజాదరణ కల్పించి దానిని తన ఎన్నికల ఖాతాలో వేసుకోవాలని ఆయన భావిస్తున్నారు.

దేశాన్ని "విశ్వగురు" చేస్తానని మోదీ ప్రకటించారు. దానికి "వికసిత్ భారత్‌ను" నినాదం చేశారు. అంటే 2047 నాటికి ప్రపంచానికి దారి చూపించే దేశంగా అభివృద్ధి సాధించాలి. ఇప్పుడు ప్రపంచంలో స్థూల జాతీయోత్పత్తిలో 4వ స్థానం పొందడం ఘన విజయంగా డప్పు కొడుతున్నారు. 140 కోట్ల జనాభాగల దేశం 3, 4 కోట్ల జనాభాగల దేశాల జీడీపీని దాటిపోవడంలోని డొల్లతనాన్ని అసలు లెక్కలు తేల్చి చెబుతున్నాయి. తలసరి జీడీపీలో భారతదేశం 4వ స్థానంలో లేదు, 140వ స్థానంలో వుంది. మానవాభివృద్ధిలో 131వ స్థానంలో వుంది. ఆకలిసూచీలో 106వ స్థానంలో వుంది. రానున్న 2, 3 దశాబ్దాలలో భారత్ ఈ రంగాలలో విశ్వగురు అయ్యే అవకాశాలు లేవని ఆర్థికవేత్తలకు తెలుసు. ఈ విషయం మోదీకి కూడా తెలుసు. విశ్వగురు స్థానాన్ని సంపాదించడానికి మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఐక్యరాజ్యసమితిలో జూన్ 21ని యోగా దినోత్సవంగా ప్రకటింపజేశారు. 196 దేశాలు దానిని ఆమోదించాయి. ఇప్పుడు యోగాలో మనమే "విశ్వగురు" అని మోదీ దేశ ప్రజలను మభ్యపెట్టదలుచుకున్నారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో పేదలున్న దేశం మనది. అత్యధిక అంతరాలు వున్న దేశం మనది. దీనిని యోగాతో కప్పిపుచ్చే ప్రయత్నం మోదీ చేస్తున్నారు.

దేశంలో మోదీ సాగిస్తున్న రాజకీయం మనకు తెలిసిందే. దేశాన్ని మతపరంగా విభజించి, మత విద్వేషపరంగా మెజారిటీ ప్రజల ఓట్లు దండుకునే రాజకీయం చేస్తున్నారు. ఇప్పుడు యోగాని ఒక మతపరమైన సాంస్కృతిక సాధనంగా వినియోగించే ప్రయత్నం చేస్తున్నారు. యోగా పుట్టుపూర్వోత్తరాల గురించి మోదీ మాట్లాడరు. అది హిందూ సాంస్కృతిక సంప్రదాయంగా ప్రచారం చేయడానికి సంఘ్ పరివారం యోగా చరిత్ర వక్రీకరణలకు పూనుకున్నారు. యోగా మీద 100 కీలక గ్రంథాలను ఐదేళ్లపాటు పరిశోధన చేసి మార్క్‌సింగిల్ టన్, జామెస్ మల్లీసన్‌లు 'ది రూట్స్ ఆఫ్ యోగా' అన్న పుస్తకాన్ని ప్రకటించారు. యోగా ఆదిలో మొదలైంది మతపరమైన సంప్రదాయం నుంచి కాదని ఆ పుస్తకంలో వారు నిగ్గు తేల్చారు. 13వ శతాబ్దికి చెందిన "దత్తాత్రేయ యోగ శాస్త్రం" లో యోగా మతానికి, కులానికి అతీతమైందని పేర్కొంటూ సాధువులు, బౌద్ధులు, బ్రాహ్మణులు, జైనులు, భౌతికవాదులకు కూడా ఆచరించదగినదిగా చెప్పారు. బౌద్ధం నుంచి వైదిక మతం యోగాను కాపీ కొట్టిందని దేవరాజు మహారాజు ఒక వ్యాసంలో స్పష్టం చేశారు. పతంజలి యోగ శాస్త్రంలోని అభూత కల్పనలను పక్కనబెట్టి మోదీ పరివారం దానిని హిందూ సాంస్కృతిక వారసత్వంగా యోగాను ప్రకటిస్తున్నది. హిందూ సాంస్కృతిక ఆధిపత్యానికి చిహ్నంగా యోగాపై ప్రచారం సాగిస్తున్నది. దీని ద్వారా ఇతర మతాలకంటే హిందూ మత ఆధిక్యతను చాటడానికి వాడుకుంటున్నారు. మతపరమైన విభజనకు యోగాను పరోక్షంగా వినియోగిస్తున్నారు.

యోగా వ్యక్తిగతంగా ఆచరించాల్సినది కాగా దానిని సామూహికం చేసి సాంస్కృతికపరమైన గుంపు భావన పెంపొందిస్తున్నారు. ఈ గుంపుతత్వంతో యోగాకు ఏకైక నాయకునిగా మోదీ భజనకు ద్వారాలు తెరుస్తున్నారు. మోదీ ఇప్పుడు రాజకీయంగా దక్షిణాది జైత్రయాత్రకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింల సంఖ్య తగినంత లేకపోవడం సాధారణ మత విద్వేష రాజకీయం ఇక్కడ అంతగా పనిచేయదు. ఆ పనిచేసి పెట్టడానికి "సనాతన ధర్మ" వేషం ధరించిన "చాక్లెట్ బాయ్" పవన్ కల్యాణ్ వున్నారు. చంద్రబాబును వశపరుచుకోడానికి మత విద్వేష రాజకీయానికి బదులు మరోదారి అవసరం. యోగా ద్వారా హిందూ సాంస్కృతిక గుంపు భావోద్వేగాన్ని కల్పించడం ద్వారా రాష్ట్రంలో మెజారిటీ ప్రజలను ఆకట్టుకునే కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. దీనికి చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారు. రాజకీయంగా రాష్ట్రంలో విస్తరించడానికి యోగా డేలో మోదీనే స్వయంగా పాల్గొంటున్నారు. రాష్ట్రంలో మోదీని మెప్పించడానికి తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీ పడుతున్నాయి. మొదటి ఛాన్స్ సనాతన ధర్మం పేరుతో మోదీకి సన్నిహితం కావడంలో పవన్ కల్యాణ్ ముందున్నారు. వెనుకబడిన చంద్రబాబు మెగా యోగా కార్యక్రమాలతో మోదీ దగ్గర తన స్థానాన్ని మెరుగు పరుచుకోవ డానికి శక్తివంచన లేని ప్రయత్నాలు చేస్తున్నారు. జూన్ 21న రెండు కోట్ల మందితో రాష్ట్ర వ్యాప్తంగాను, మోదీ చెంతన రెండు లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. నెల రోజులుగా స్వర్ణాంధ్రప్రదేశ్ నినాదం పక్కకు పోయింది యోగాంధ్ర నినాదం ముందుకొచ్చింది. మోదీ రాజకీయ విస్తరణకు చంద్రబాబు కొత్త ద్వారాలు తెరిచారు. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు మతపరమైన రాజకీయ ముప్పుకానుంది. రాష్ట్ర ప్రజలు తమ తమ శారీరక , మానసిక అవసరాల కోసం యోగాను ఆదరించండి. కాని యోగా ముసుగులో మోదీ రాజకీయ పన్నాగాలను నిరసించండి.

సెల్:8500678977

సంధికి పుతిన్, జిన్‌పింగ్ యత్నం

నిత్య చక్రవర్తి

ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య యుద్ధం శుక్రవారానికి 8వ రోజుకి చేరింది. ఏమాత్రం ఎవరికీ తెలియకుండా ఇజ్రాయిల్ సైన్యం ఇరాన్ మీద దాడిచేసింది. గత 24గంటల్లో కొన్ని ప్రధానమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరాన్‌ను ప్రత్యేకించి తెహ్రాన్ నగరాన్ని వీలైనంత త్వరగా ధ్వంసంచేయాలని ఇజ్రాయిల్ నిర్ణయించుకుంది. అమెరికాకు తెలిసే ఇజ్రాయిల్ దాడి జరిపింది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ యుద్ధం నిలిపివేసేందుకు సంయుక్తంగా ఒక వ్యూహాన్ని పన్ని రెండు దేశాల మధ్య సంధి కుదిర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు. ఇజ్రాయిల్ దాడిని పుతిన్, జిన్‌పింగ్ తీవ్రంగా ఖండించారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌తో కలిసి యుద్ధంలో జోక్యం చేసుకోవద్దని పుతిన్, జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి సూచించారు. పుతిన్, జిన్‌పింగ్ సంధి కుదిర్చేందుకు ప్రయత్నిస్తున్నందున ట్రంప్ యుద్ధరంగంలోకి దిగడంలేదు. ఇరాన్‌కి పాకిస్థాన్ మద్దతు తెలియజేసినందున ట్రంప్ కెనడా నుంచి ఆఘమేఘాల మీద అమెరికాకు చేరుకుని పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌తో మాట్లాడుతున్నారు. అంతేకాదు, యుద్ధరంగంలోకి దిగవద్దని ట్రంప్ రెండు రోజుల క్రితమే పాకిస్థాన్‌కు సూచించారు.

పుతిన్, జిన్‌పింగ్ రంగంలోకి దిగినందున ట్రంప్ వెనకాడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. తక్షణం కాల్పుల విరమణ చేయాలని కోరుతూ చైనా నాలుగు అంశాల సూత్రాన్ని ప్రతిపాదించింది. అదేసమయంలో సమస్య పరిష్కారానికి అణుశక్తి అంశంపై చర్చలను కూడా చైనా సూచించింది. మరో ముఖ్యమైన పరిణామం కూడా చోటుచేసుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ కలిసి శుక్రవారం జెనీవాలో చర్చలకు రావలసిందిగా ఆహ్వానించగా, ఆయన వెంటనే అంగీకరించారు. ఒకవైపు సాయుధ ఘర్షణ జరుగుతుండగా, మరోవైపు విదేశాంగ మంత్రులు చర్చలు జరుపుతున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్‌తో కలిసి యుద్ధంలో పాల్గొనకుండా మరో రెండు వారాలపాటు ట్రంప్ వాయిదా వేశారు. ఈ వారం ఆదివారమే యుద్ధంలోకి దిగాలని ట్రంప్ నిర్ణయించుకోగా చైనా, రష్యాల ప్రతిపాదనతో ఆయన వెనక్కుతగ్గారు.

ట్రంప్ యుద్ధంలోకి వెంటనే దిగరాదని బుధవారమే రెండువారాలు వాయిదా వేశారు. చైనా, రష్యాలు సంయుక్తంగా ఇజ్రాయిల్‌ను ఖండించాయి. రెండు దేశాలు కలిసి సంధి కుదర్చడానికి మరో కొన్ని కీలకమైన సైనిక అంశాలుకూడా ఉన్నాయని తెలుస్తోంది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ ఇంతవరకు అత్యంత శక్తిమంతమైన క్షిపణులను వినియోగించలేదని సంధి కుదరకపోతే అలాంటి క్షిపణులను వినియోగించేందుకు ఇరాన్ కీలకమైన నాయకుడు అయతుల్లా ఖామేని నిర్ణయించినట్లుకూడా తెలుస్తోంది. చైనా, రష్యాల నుంచి మరింత శక్తిమంతమైన ఆయుధాలు ఇరాన్‌కు చేరనున్నాయని తెలిసిన నేపథ్యంలో పెంటగాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. లండన్ నుంచి వెలువడే గార్డియన్ తాజా విశ్లేషణను ప్రకటించింది. ఇరాన్ క్షిపణులపై దాడిచేసేందుకు ఇజ్రాయిల్ ఇంటర్‌సెప్టర్‌లను (ఈ ఆయుధాలను మధ్యలోనే ధ్వంసం చేయవచ్చు) ఇజ్రాయిల్ ఉపయోగించనున్నదని గార్డియన్ తెలిపింది. యుద్ధం ఇంకా కొనసాగినట్లయితే ఇజ్రాయిల్ వద్ద అత్యంత శక్తిమంతమైన ఇంటర్‌సెప్టర్‌లు దాదాపు ముగిసిపోయాయని, అయితే ఇది ఇరాన్ వద్ద ఉన్నాయని గార్డియన్ తెలిపింది. అమెరికా ఇజ్రాయిల్‌కు అనుకూలంగా జోక్యం చేసుకోకపోతే, యుద్ధంలో ఇజ్రాయిల్ విజయంసాధించే అవకాశాలు లేవని కొన్ని వర్గాలు ప్రకటిస్తున్నాయి. తక్షణం నిర్ణయం తీసుకుని ట్రంప్ యుద్ధంలో పాల్గొనాలని ఇజ్రాయిల్ పాలకుడు నెతన్యాహు బ్రతిమలాడుతున్నాడు. ఈ ఇద్దరు నాయకులు ఒకే విధమైన ఆలోచన చేస్తున్నప్పటికీ వ్యూహంలో విభేదిస్తున్నారు. సంధి కుదిర్చే విషయంలో చైనా, రష్యా గట్టి నిర్ణయాన్ని తీసుకున్నాయి.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధానికి దూరంగా ఉంచేందుకు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నించారు. అయితే జిన్‌పింగ్ పశ్చిమాసియాలో ట్రంప్ విధానాన్ని బహిరంగంగా సవాలు చేశారు. అయితే కాల్పుల విరమణకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనను జిన్‌పింగ్ ముందుకు తెచ్చారు. ప్రజాసమూహాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని సంప్రదింపులు, చర్చల ద్వారా మౌలికమైన పరిష్కారాలను అంతర్జాతీయ సమాజం శాంతికోసం కృషిచేయవలసిన అవసరం ఉంది. పుతిన్‌తో చర్చించి ఫార్ములాను రూపొందించనున్నారు. చైనా, రష్యా నాయకులు సమన్వయంతో వ్యూహాత్మక సహకారాన్ని అనుసరించడంతోపాటు అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశాన్ని పంపనున్నారు. ఉద్రిక్తతలను సడలించి ప్రాంతీయ ప్రజారక్షణకు ఇద్దరునేతలు పిలుపునిచ్చారు. గ్లోబల్ టైమ్స్ పత్రిక శుక్రవారం సంపాదకీయంలో చైనా తన అధికారిక అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

ఇజ్రాయిల్‌పైన ప్రత్యేకమైన ప్రభావాన్ని చైనా కలిగి ఉంది. ఇదే సమయంలో అమెరికా నిర్మాణాత్మకమైన పాత్రను పోషించలేదు. అందుకు బదులుగా ట్రంప్ మంటలను మరింత పెంచుతున్నాయి. అంతేకాక, నేరుగా యుద్ధంలో పాల్గొంటానన్న సూచనను కూడా ఇవ్వడానికి ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ లోపు చైనా, రష్యా సంధికుదిర్చేందుకు సిద్ధమైన నేపథ్యంలో ట్రంప్ రెండువారాలు వాయిదా వేసుకున్నారు. సాయుధ సంఘర్షణ ప్రస్తుతం తీవ్రమైన స్థానానికి చేరిన నేపథ్యంలో సంక్షోభాన్ని సున్నితంగా పరిష్కరించుకోవలసిన సమయం వచ్చింది. పుతిన్, జిన్‌పింగ్ నాలుగు అంశాలతోకూడిన వ్యూహాన్ని ప్రతిపాదించారు. ఇందులో ప్రస్తుత సమస్యలను చర్చించారు. ఇరాన్‌పై దాడి జరిపిన ఇజ్రాయిల్ తక్షణం సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని అమాయక పౌరులకు హాని కలిగించరాదని ఇరాన్ అణుశక్తి సమస్యను రాజకీయంగా పరిష్కరించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలు అమలుచేస్తే ప్రస్తుత పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఇజ్రాయిల్ క్షిపణులను పనిచేయకుండా చేసేందుకు వైమానిక రక్షణ యంత్రాలను అలాగే శక్తిమంతమైన సాంకేతిక రాడార్ వ్యవస్థలను చైనా ఇరాన్‌కు పంపేఅవకాశాలున్నాయి. చైనా వద్ద అత్యంత సాంకేతికపరమైన శక్తివంతమైన మిసిలీలలు ఇంకా అనేక ఆయుధాలు ఉన్నాయి. వీటిని ఇరాన్‌కు ఇచ్చినట్లయితే ఇజ్రాయిల్ బలహీనపడే అవకాశాలు కూడా లేకపోలేదు.

ఆటవిక పాలనకు చరమగీతం

అభివృద్ధికి బాటలు: మోదీ

పాట్నా: బీహార్‌ను ఆటవిక రాజ్యంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని చెప్పుకొచ్చారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని మోదీ బీహార్‌లో పర్యటించారు. ఎన్డీయే ప్రభుత్వ విజయాల పేరుతో గొప్పలు చెప్పుకున్నారు. విపక్షాలపై ఎదురుదాడి చేశారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రస్తావిస్తూ 55 వేల కిలోమీటర్ల వరకు గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పుకొచ్చారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు.

పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లు శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు.

బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్ధిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఎన్డీయే నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగానదిని శుభ్రపరిచారా?

బీహార్‌లో ఎన్డీఏ అన్నింటా విఫలం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: కేంద్రం బీహార్ ప్రభుత్వం గంగానదిని శుభ్రపరిచే హామీని నెరవేర్చలేదని, గత 11 సంవత్సరాలలో నదిని కాలుష్య కారకాల నుంచి తొలగించే కసరత్తు కేవలం 'ఎన్నికల జుమ్లా' గా మారిందని కాంగ్రెస్ శుక్రవారం పేర్కొంది. బీహార్‌లోనే కాదు. 'గంగా తల్లి' గతంలో ఎన్నడూ లేనంతగా కలుషితమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'గంగా పరిశుభ్రత ప్రచారం పేరుతో ప్రారంభించిన చాలా పథకాలు అవినీతిమయంగా నిరూపితమయ్యాయి. శంకుస్థాపన, ప్రారంభోత్సవం, భారీ ప్రచారం తర్వాత ఏ పని కనిపించడం లేదు లేదా ఎటువంటి నిర్దిష్ట ఫలితం లేదు' అని ఆయన 'ఎక్స్' లో హిందీలో పోస్ట్ చేశారు. గంగా నది పరిరక్షణ కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.18,000 కోట్లకు పైగా విలువైన నమామి గంగా ప్రాజెక్టు క్రింద మురుగునీటి శుద్ధి కర్మాగారాలను (ఎస్‌టీపీలు) ప్రారంభించిన తర్వాత జైరాం రమేశ్ ఈ విమర్శలు చేశారు. 'ప్రకటనలను ఇష్టపడే ప్రధాన మంత్రి మరోసారి బీహార్ పర్యటనకు వచ్చారు. ప్రధానమంత్రి ఎన్ని నకిలీ ప్రకటనలు చేసినా, ఉచిత ప్రకటనల కోసం ఎన్ని రిబ్బన్లు కత్తిరించినా, బీహార్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం సామాన్య ప్రజల అంచనాలను అందుకోవడంలో పూర్తిగా విఫలమైందనే విషయం నిజం' అని అన్నారు. బీహార్‌లో అణగారిన వర్గాలపై అణచివేత గరిష్టస్థాయికి చేరుకుందని, శాంతిభద్రతల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, నేరస్తులు అదుపు తప్పిపోయారని, సామాన్య పౌరులు నిస్సహాయులుగా ఉన్నారని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. ప్రతిరోజూ మహిళలపై హత్యలు, దోపిడీలు, హింసకు సంబంధించిన నివేదికలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లేవని, వారు బీహార్ నుంచి వలస వెళ్లాల్సి వస్తోందని కేంద్ర మాజీ మంత్రి అన్నారు. బీహార్‌లో గంగా కాలుష్యానికి సంబంధించి భయంకరమైన పరిస్థితిని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) స్వయంగా బయటపెడుతుందని పేర్కొన్నారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించాలి

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించాలని జైరాం రమేశ్ మరోమారు డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో తప్పకుండా లేవనెత్తుతామని చెప్పారు. బీహార్ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, ఈబీసీలకు కోటా కోసం అనుమతి ఇవ్వాలని జైరాం రమేశ్ శుక్రవారం 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సాధికారికత, ప్రాథమిక ప్రాముఖ్యత కలిగిన అంశాలను పార్లమెంట్ సమావేశాల్లో చర్చకు తెస్తామన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లను కాపాడటానికి 1994లో కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చిందని గుర్తు చేశారు.

శశిథరూర్ వ్యాఖ్యలు నిజం కాదు: కాంగ్రెస్

తిరువనంతపురం: కేరళలోని నిలంబూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల వేళ ప్రచారానికి తనను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించలేదంటూ తిరువనంతపురం ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ మాట్లాడటంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. కేరళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సన్నీ జోసఫ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికల ప్రచారం కోసం రూపొందించిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఎంపీ శశిథరూర్ పేరు ఉందన్నారు. అందుకు సంబంధించిన జాబితాను కేంద్ర ఎన్నికల సంఘానికి సైతం సమర్పించామని వివరించారు. అంతకుమించి ఈ వ్యవహారంపై తాను స్పందించ లేనంటూ ఆయన పేర్కొన్నారు. అయితే ఉపఎన్నికల ప్రచారానికి కేంద్ర మాజీమంత్రి ఏకే ఆంటోని తప్ప మిగిలిన నేతలంతా సహకరించారన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన అర్యాదన్ షౌకత్‌కు మద్దతుగా రమేశ్ చన్నీతాల, కె.సురేశ్ ప్రచారంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. నిలంబూర్ ఉప ఎన్నిక ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదంటూ గురువారం విలేకరులు శశిథరూర్‌ను ప్రశ్నించగా... తనను పార్టీ ఆహ్వానించలేదని చెప్పుకొచ్చారు. అదీకాక ఆ సమయంలో తాను విదేశీ పర్యటనలో ఉన్నానని పేర్కొన్నారు.

గవర్నర్ పాత్ర, రాజ్యాంగ పరిమితులు

బోధనాంశాలుగా చేర్చాలని కేరళ నిర్ణయం

తిరువనంతపురం: కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉన్నత మాధ్యమిక తరగతుల సిలబస్‌లో మార్పులు చేసింది. గవర్నర్ పాత్ర, అధికారాలు, రాజ్యాంగ పరిమితులను బోధనాంశాలుగా చేర్చనుంది. ఈ మేరకు కేరళ విద్యా శాఖ ఒక ప్రకటన చేసింది. సమాఖ్య రాజకీయాల గురించి తెలియజేసే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ప్రక్రియలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు ఆయా అంశాలను కూడా సిలబస్‌లో చేర్చినట్లు తెలిపింది. విద్యార్థి స్థాయి నుంచే ఈ అన్ని అంశాలు తెలియడం నేటి సామాజిక అవసరాల దృష్ట్యా ముఖ్యమని విద్యా శాఖ మంత్రి శివన్‌కుట్టి అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు మార్పులను వివరించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ముఖ్యమంత్రి, కేబినెట్, అసెంబ్లీ సమిష్టి బాధ్యతలు విద్యార్థులకు తెలియాలన్నారు. రాష్ట్ర నిధులతో నడిచే విశ్వవిద్యాలయాల నిర్వహణలో ఛాన్సలర్‌గా గవర్నర్ జోక్యం, అసెంబ్లీ తీర్మానించిన బిల్లుల ఆమోదానికి నిరాకరించడం, రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేయడం ద్వారా కీలక బిల్లులను ఆలస్యం చేయడం, కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల చిహ్నాలు ప్రదర్శించడం వంటి వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కేరళ ప్రభుత్వం ఈ మేరకు పాఠ్యాంశాల్లో మార్పులు చేయడం చర్చకు దారితీసింది. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భరతమాతగా ప్రదర్శించే సింహంపై కాషాయ జెండాతో ఉన్న మహిళ చిత్రాన్ని అధికారిక కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రదర్శించడాన్ని నిరసిస్తూ శివన్‌కుట్టి వాకౌట్ చేసిన సంగతి తెలిసిందే.

ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదు: రాహుల్

న్యూఢిల్లీ: ఆంగ్ల భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ప్రతిస్పందించారు. ఆంగ్ల భాష సిగ్గుపడే భాష కాదని, అది సాధికారికతను కల్పించే భాష అన్నారు. ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాష నేర్పించాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. కానీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఆ భాషను పేద పిల్లలు నేర్చుకోకుండా చేస్తున్నాయని, ఎందుకంటే ప్రశ్నించడం వాళ్లకు ఇష్టం ఉండదని, సమానత్వాన్ని వాళ్లు కోరుకోవడం లేదని రాహుల్ విమర్శించారు. తన ఎక్స్ ఖాతాలో హిందీ భాషలో రాహుల్ గాంధీ శుక్రవారం ఓ పోస్టు చేశారు. ఇంగ్లీష్ భాష ఆనకట్ట కాదని, అదో వారధి అన్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం సిగ్గుచేటు కానేకాదని, అది సాధికారికత ఇస్తుందన్నారు. ఇంగ్లీష్ గొలుసు కాదని, అది గొలుసుల్ని బ్రేక్ చేసే పరికరమన్నారు. భారత దేశ పేద ప్రజలు ఇంగ్లీష్ నేర్చుకోవద్దన్న ఆలోచనలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఉన్నట్లు రాహుల్ ఆరోపించారు. మాతృభాష తరహాలోనే ఇంగ్లీష్ భాష ముఖ్యమైందని, అది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెంచుతుందన్నారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాష నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే భారత్‌కు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం ఆపండి

బెంగాల్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

కోల్‌కతా: ఉద్యోగాలు కోల్పోయిన బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం కోసం బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని ఆపేయాలని కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. ఈ పథకాన్ని సెప్టెంబరు 26 వరకు లేదా తదుపరి ఆదేశాలిచ్చే వరకు నిలిపివేస్తూ శుక్రవారం జస్టిస్ అమృత సిన్హా ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ ఇవ్వాలని, ఆపై 15 రోజుల్లోగా పిటిషనర్లు స్పందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బెంగాల్ ప్రభుత్వం స్కూల్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 2016లో ఎంపిక ప్రక్రియ ద్వారా నియమించిన గ్రూప్ సీ -గ్రూప్ డీ విభాగాల్లోని బోధనేతర సిబ్బందికి కోర్టు ఆదేశాలకు కట్టుబడి తాత్కాలిక ప్రాతిపదికన మానవతా దృక్పథంతో పరిమిత జీవనోపాధి, మద్దతు-సామాజిక భద్రత కల్పించేందుకు ఒక పథకాన్ని బెంగాల్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రూప్-సీ, గ్రూప్-డీ ఉద్యోగులకు ఒక్కొక్కరికి వరుసగా రూ.25వేలు, రూ.20వేలు చొప్పున బెంగాల్ ప్రభుత్వం చెల్లించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈనెల 9న కోర్టు తీర్పు రిజర్వులో ఉంచారు. తాజాగా పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ కోల్‌కతా హైకోర్టు ఆదేశాలిచ్చింది.

8 ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం తర్వాత నుంచి దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా తరచుగా వార్తల్లో నిలుస్తోంది. ఈ దుర్ఘటనను మరవకముందే సంస్థకు చెందిన కొన్ని విమానాల్లో సాంకేతిక సమస్యలు బయటపడటం కలవరపెడుతోంది. మరోవైపు, నిర్వహణ సమస్యలూ వెంటాడుతున్నాయి. దీని కారణంగా ఈ మధ్యకాలంలో కొన్ని విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. తాజాగా శుక్రవారం ఎనిమిది సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిరిండియా ప్రకటించింది. మెయింటెనెన్స్, కార్యాచరణ సమస్యల కారణంగా వీటిని రద్దు చేసినట్లు వెల్లడించింది. దుబాయ్ నుంచి చెన్నై రావాల్సిన ఏఐ 906, దిల్లీ నుంచి మెల్‌బోర్న్ వెళ్లాల్సిన ఏఐ 308, మెల్‌బోర్న్ నుంచి దిల్లీ రావాల్సిన ఏఐ 309, దుబాయ్ నుంచి హైదరాబాద్ రావాల్సిన ఏఐ 2204, పూనె నుంచి దిల్లీ వెళ్లాల్సిన ఏఐ 874, అహ్మదాబాద్ నుంచి దిల్లీ వెళ్లాల్సిన ఏఐ 456, హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లాల్సిన ఏఐ 2872, చెన్నై నుంచి ముంబై వెళ్లాల్సిన ఏఐ 571 విమానాలు రద్దు చేసింది. నిర్వహణ సమస్యల కారణంగా జులై రెండోవారం వరకు తమ అంతర్జాతీయ విమాన సర్వీసులను 15 శాతం తగ్గించనున్నామని ఎయిరిండియా ఇప్పటికే ప్రకటించింది. అందులో భాగంగా 16 అంతర్జాతీయ మార్గాల్లో విమాన సర్వీసులు తగ్గించినట్లు కంపెనీ ప్రకటించింది. జూన్ 21 నుంచి జులై 15 వరకు ఈ సర్వీసుల తగ్గింపు కొనసాగుతుందని విమానయాన సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది.

చెన్నైలో విమానం అత్యవసర ల్యాండింగ్

చెన్నై: గత పదిరోజులుగా విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా చెన్నై నుంచి మదురైకి బయల్దేరిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్యలు బయటపడ్డాయి. విమానం 68 మంది ప్రయాణికులతో శుక్రవారం ఉదయం 6.44 గంటల సమయంలో చెన్నై నుంచి మదురైకి బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన 30 నిమిషాల తర్వాత సాంకేతిక సమస్య తలెత్తింది. అప్రమత్తమైన పైలట్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విమానాన్ని తిరిగి చెన్నైకి మళ్లించేందుకు అనుమతి కోరాడు. తిరిగి ఉదయం 7:.17 గంటలకు విమానం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ప్రయాణికులను కిందకు దించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనపై ఇండిగో నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

కళానిధి మారన్‌కు దయానిధి లీగల్ నోటీస్

ముంబై: మారన్ సోదరుల మధ్య వివాదం సన్ టీవీ షేర్ల పతనానికి కారణమైంది. ఆ ఛానల్ షేర్లు నాలుగు శాతం పడిపోయాయి. డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీమంత్రి దయానిధి మారన్... తన సోదరుడు కళానిధి మారన్‌కు లీగల్ నోటీసులు పంపారు. సన్ టీవీ నెట్‌వర్క్ చైర్మన్‌గా కళానిధి వ్యవహరిస్తున్నారు. 2003లో జరిగిన షేర్ల లావాదేవీల అంశంపై కళానిధి మారన్‌తో పాటు ఆయన భార్య కావేరి కళానిధికి... దయానిధి మారన్ లీగల్ నోటీసులు ఇచ్చారు. సన్ టీవీ టేకోవర్ సమయంలో తప్పుడు విధానాలు, తప్పుడు పాలనతో అక్రమాలకు పాల్పడినట్లు కళానిధి మారన్‌పై దయానిధి మారన్ విమర్శలు చేశారు. కోఆర్డినేటెడ్ పద్ధతిలో ఆర్థిక నేరాలకు తన సోదరుడు పాల్పడినట్లు దయానిధి మారన్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. చీటింగ్, మనీ ల్యాండరింగ్‌కు కూడా పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం ఆ కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. తండ్రి మురసోలీ మారన్ 2003లో మృతిచెందారు. ఆ తర్వాత జరిగిన సన్ టీవీ షేర్లు అప్పగింతలో వివాదం నెలకొన్నట్లు తెలుస్తోంది. వీలునామా రాయకుండానే తండ్రి చనిపోయారని, అందుకే 2003 నాటి ప్రకారం షేర్ల పంపకం జరగాలన్నారు. సెబీ, ఆర్బీఐ, ఎస్ఎఫ్ఐఓ, ఈడీ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలు ఈ విచారణలో పాల్గొనాలని కళానిధికి నోటీసులో తెలిపారు. కంపెనీలో కళానిధి మారన్‌కు 75 శాతం వాటా ఉన్నది. అది మార్కెట్ విలువ 25 వేల కోట్లు. సన్ టీవీ నెట్‌వర్క్ లో తమిళం, తెలుగు, హిందీ, బెంగాలీ భాషలు ఉన్నాయి. ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఉన్నాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఉంది.

రూ.5 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ముంబై : దిల్లీ నుంచి ముంబై వెళ్తున్న బస్సు నుంచి సుమారు ఐదు కోట్ల ఖరీదైన మాదకద్రవ్యాలను సీజ్ చేశారు.

నైజీరియాకు చెందిన మహిళ నుంచి ఆ డ్రగ్స్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరి కోసమైతే డ్రగ్స్ తీసుకెళ్తున్నారో, ఆ వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. బస్సులో దొరికిన డ్రగ్స్‌లో మెటాంఫెటమైన్ ఉన్నది.

నిషేధిత వస్తువులను... ఫుడ్ ప్యాకెట్లలో పెట్టి తీసుకెళ్తున్నారు. ఓట్స్, జూస్ టెట్రా ప్యాకెట్లలో డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా... దిల్లీ నుంచి వస్తున్న బస్సును డీఆర్ఐ అధికారులు అడ్డగించారు. ముంబైకి 50 కిలోమీటర్ల దూరంలోనే ఆ బస్సును తనిఖీ చేశారు. మహిళ నుంచి 2.56 కేజీల మెటాంఫటమైన్‌తో పాటు 584 గ్రాముల ఎక్స్‌టసీ ట్యాబెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండింటి విలువ రూ.ఐదు కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. నార్కోటిక్ డ్రగ్స్ చట్టం ప్రకారం నైజీరియా మహిళను అరెస్టు చేశారు. కేసు విచారణ కొనసాగుతోంది.

బెంగాల్‌లో కారు-ట్రక్కు ఢీ

9 మంది మృతి

పురులియా: పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలోని 18వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం కారు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బలరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నామ్షోల్ గ్రామ సమీపంలో ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని ఒక అధికారి అన్నారు. హైవేపై బొలెరో ఎస్‌యూవీ-ట్రక్కు ఢీకొనడంతో నాలుగు చక్రాల వాహనంలో ఉన్న 9 మంది మరణించారని బలరాంపూర్ పోలీస్ స్టేషన్ ఇంఛార్జ్ సౌమ్యదీప్ మల్లిక్ పీటీఐకి చెప్పారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, బాధితులు వివాహ వేడుక నుంచి తిరిగి వస్తుండగా వారు పురులియాలోని బారాబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడబానా గ్రామం నుంచి పొరుగున ఉన్న జార్ఖండ్‌లోని నిమ్డిహ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని తిలైటాండ్‌కు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎస్‌యూవీ పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు, అత్యవసర సహాయక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు, అక్కడ వైద్యులు వారందరూ మరణించారని ప్రకటించారు. అక్కడ వైద్యులు ప్రమాదానికి అతివేగం, నిర్లక్ష్యం కారణమని పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంధ విద్యార్థుల గీతాలాపనతో రాష్ట్రపతి భావోద్వేగం

డెహ్రాడూన్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తరాఖండ్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. శుక్రవారం ద్రౌపది ముర్ము పుట్టినరోజు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆమె డెహ్రాడూన్‌కు వెళ్లారు. అక్కడి అంధుల పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అక్కడ పలువురు అంధ విద్యార్థులు గీతాలు ఆలపించి రాష్ట్రపతికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... తన ప్రజా జీవితంలో అత్యంత హత్తుకునే క్షణాల్లో ఇవి ఒకటన్నారు. కల్మషం లేని చిన్నారుల స్వరం, వారి బలం, స్ఫూర్తి భారతదేశ నిజమైన ఆత్మను ప్రతిబింబిస్తుందన్నారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

అమిత్‌షా గుమస్తా షిండే: రౌత్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే చేతులు కలుపడంపై షిండే ఎగతాళి వ్యాఖ్యలు చేయడాన్ని రౌత్ తప్పుపట్టారు. ఏక్‌నాథ్ షిండే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు గుమస్తా అని ఎద్దేవా చేశారు. ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన పార్టీకి అధ్యక్షుడు అమిత్‌షానే అని, షిండే కేవలం ఆయన చేతికింద గుమస్తా అని వ్యాఖ్యానించారు. ఇద్దరు అన్నదమ్ములు చేతులు కలిపితే ఏక్‌నాథ్ షిండేకు ఈర్ష్య ఎందుకని ప్రశ్నించారు. అమిత్‌షాకు గుమస్తాగా మారినందుకు షిండే ఈర్ష్య పడాలన్నారు.

విమానం కూల్చేస్తా: మహిళ బెదిరింపు

బెంగళూరు: మహిళా వైద్యురాలు విమానం సిబ్బందితో దురుసుగా ప్రవర్తించింది. ఆమె సీటు వద్ద కాకుండా ముందు వరుస క్యాబిన్‌లో ఉంచిన బ్యాగ్‌ను తీసేందుకు నిరాకరించింది. వాగ్వాదం ముదురడంతో విమానాన్ని కూల్చివేస్తానని ఆమె బెదిరించింది. సెక్యూరిటీ సిబ్బంది ఆ మహిళను విమానం నుంచి దించి అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... యెలహంక సమీపంలోని శివనహళ్లిలో నివసించే వ్యాస్ హిరాల్ మోహన్‌భాయ్ (36) మహిళా డాక్టర్. ఈ నెల 17న బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సూరత్‌కు వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఎక్కింది. తన బ్యాగ్‌ను మొదటి వరుస క్యాబిన్ వద్ద ఉంచి 20 ఎఫ్ సీటులో కూర్చుంది. దీన్ని గమనించిన విమాన సిబ్బంది ... మీరు కూర్చొన్న సీటు పైన ఉన్న క్యాబెన్‌లో ఆ బ్యాగ్ ఉంచాలని డాక్టర్ వ్యాస్ హిరాల్‌ను కోరారు. దీనికి ఆమె నిరాకరించింది. సిబ్బంది పదే పదే అభ్యర్థించినప్పటికీ, పైలట్ జోక్యం చేసుకున్నప్పటికీ ఆ లేడీ డాక్టర్ వినిపించుకోలేదు. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించింది. ఇతర ప్రయాణికులు జోక్యం చేసుకోవడంపై అరిచి గోల చేసింది. విమానాన్ని కూల్చివేస్తానని బెదిరించింది.

యుద్ధం మంచిది కాదు

- ఇజ్రాయిల్‌ను రెచ్చగొట్టడానికి ఇరాన్ ఏమి చేసింది?
- మా జలాలను వాడుకునే హక్కు మాకుంది: ఒమర్

శ్రీనగర్: యుద్ధం ఎక్కడైనా మంచిది కాదని... ఇజ్రాయిల్‌ను రెచ్చగొట్టడానికి ఇరాన్ ఏమి చేసిందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్‌కు దాని జలాలను ఉపయోగించుకునే హక్కు ఉందని, ప్రస్తుతానికి మిగులు నీటిని ఇతర రాష్ట్రాలకు మళ్లించే ఉద్దేశం లేదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు తెలిపారు. డేటా ఆధారిత పర్యవేక్షణ, వ్యూహాత్మక కమ్యూనికేషన్ ద్వారా సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కారం, సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడాన్ని నిర్ధారించడానికి జమ్మూలో ఒక కార్యాలయం రాబ్తాను ప్రారంభించిన తర్వాత అబ్దుల్లా మీడియాతో సంభాషించారు. ఇజ్రాయిల్-ఇరాన్ వివాదం గురించి అడిగినప్పుడు... 'ఇది మంచి విషయం కాదు. ఎక్కడైనా యుద్ధం మంచిది కాదు. ఇజ్రాయిల్ దాడి చేయడానికి ఇరాన్ ఏమి చేసింది?. వివాదం ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిది' అని అన్నారు. ఇజ్రాయిల్‌ను విమర్శిస్తూ, 'రెండు నెలల క్రితం ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ చీఫ్... అణుబాంబు తయారీకి ఇరాన్ ఎక్కడా చేరువ కాలేదని అన్నారు. అప్పటికి అదే సాక్ష్యం. ఇప్పుడు రెండు నెలల తర్వాత ఇజ్రాయిల్ అకస్మాత్తుగా ఇరాన్‌పై దాడి ప్రారంభించింది. ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య యుద్ధం వాతావరణంలో 6 వేల మంది భారతీయులు చిక్కుకున్నారు' అని తెలిపారు. 'మేము వారిని ఒక్కొక్కరిగా తరలిస్తున్నాము. 90 మంది విద్యార్థులను (జమ్మూకశ్మీర్‌కు చెందిన) ఇప్పటికే తీసుకువచ్చాం. మరో 400 మంది సురక్షితమైన ప్రదేశాలకు చేరుకున్నారు. 6 వేల మందికి పైగా విద్యార్థులను తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారిలో 1,400 మంది జమ్మూకశ్మీర్‌కు చెందినవారు' అని అన్నారు. గురువారం ఉదయం ఇరాన్ నుంచి తరలించబడిన తర్వాత దిల్లీలో దిగిన 90 మంది విద్యార్థులలో కొంతమందిని కశ్మీర్‌కు తీసుకువెళ్లిన బస్సుల పరిస్థితిపై ఫిర్యాదు గురించి అడిగినప్పుడు... ప్రారంభంలో ఏర్పాటు చేసిన వాహనాలు 'సరిగా లేవని' అంగీకరించారు. 'మాకు సమాచారం అందిన వెంటనే మేము సరైన వాహనాలను ఏర్పాటు చేశాము. వారు ఇప్పుడు వారి ఇళ్లకు చేరుకుంటున్నారు. భవిష్యత్‌లో మరింత జాగ్రత్తగా ఉండాలని అక్కడి అధికారులకు చెప్పడం జరిగింది' అని ఆయన అన్నారు. మిగులు నీటిని ఇతర రాష్ట్రాలకు మళ్లించడానికి కాలువ నిర్మించే ఏ ప్రతిపాదనకు కూడా ప్రస్తుతం అనుమతి ఇవ్వబోమని ఆయన స్పష్టం చేశారు. 'ఎవరూ దానికి (ఆమోదం) ఇవ్వరు. ప్రస్తుతానికి నేను దానికి ఆమోదం ఇవ్వబోవడం లేదు. ముందుగా మన నీటిని ఉపయోగించుకోవడానికి మమ్మల్ని అనుమతించాలి. తర్వాత ఇతరుల గురించి మాట్లాడుకుందాం' అని అబ్దుల్లా అన్నారు. జమ్మూకశ్మీర్ నుంచి పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌కు మిగులు నీటిని తరలించడానికి పొరుగున ఉన్న పాకిస్థాన్‌కు ప్రవహించకుండా నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 113 కిలోమీటర్ల కాలువ నిర్మాణంపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'ప్రస్తుతం జమ్మూ నీటి కొరతను ఎదుర్కొంటోంది. కుళాయిల్లో నీరు లేదు. నేను పంజాబ్‌కు నీటిని ఎందుకు పంపాలి? సింధు జల ఒప్పందం ప్రకారం పంజాబ్‌లో ఇప్పటికే మూడు నదులు ఉన్నాయి. పంజాబ్ మాకు ఏదైనా నీరు ఇచ్చిందా?' అని ఆయన ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్ నీటి కోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నప్పుడు... పంజాబ్ ఉజ్ బహుళార్థసాధక ప్రాజెక్టు, షాపూర్ కండి బ్యారేజీ నుంచి పంచుకోలేదని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'వారు మమ్మల్ని సంవత్సరాలుగా బాధపెట్టారు. సుదీర్ఘ పోరాటం తర్వాత మాత్రమే వారు కొన్ని చర్యలు తీసుకున్నారు' అని ఆయన అన్నారు. 'మేము దానిని (నీటిని) మొదట ఉపయోగిస్తాము. ఆపై మాత్రమే ఇతరుల అవసరాలను పరిగణలోకి తీసుకుంటాము' అని తెలిపారు. సింధు జల ఒప్పందం గురించి మాట్లాడుతూ ప్రభుత్వం రెండు కీలక ప్రాజెక్టులపై పని చేస్తోందని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ నిబద్ధతకు కట్టుబడి ఉంటుందని అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. చట్టపరమైన మార్గాన్ని ఎంచుకోవడం పరిశీలనలో ఉందా అని అడిగినప్పుడు... 'చట్టపరమైన ఎంపికల గురించి మాట్లాడే సమయం వచ్చినప్పుడు నేను మీకు ఫోన్ చేస్తాను' అని ఆయన అన్నారు. రిజర్వేషన్ల అంశంపై నివేదికను న్యాయ శాఖ పరిశీలిస్తోందని, నివేదిక తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ దానిపై చర్చలు జరుపుతుందని ఒమర్ అబ్దుల్లా చెప్పారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రభుత్వ భూములను ఆక్రమణల నుండి కాపాడాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణల నుండి కాపాడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తహసీల్దార్లకు సూచించారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో రెవెన్యూ భూ సమస్యలపై జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలోని ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండలాల వారీగా భూ సమస్యలపై వివరంగా తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ భూముల భూ వివాదాం, ఆక్రమణలకు గురైన సమస్యలపై కోర్టులో ఉన్న కేసులు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నవని వివరంగా విచారించారు. ఒక్కొక్క కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్లతో అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలను, సూచనలకు కలెక్టరు అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్ (ప్రిలిమ్స్- కం-మెయిన్స్) ఎగ్జామినేషన్ 2026 కోసం శిక్షణ పొందుటకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన 100 మంది విద్యార్థులను జులై 12న నిర్వహించే ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, మరో 50 మంది అభ్యర్థులను గతంలో ఏమైనా సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. వీరు సంబంధిత పత్రాలతో నేరుగా టి.జి .బి.సి.ఈ.ఎస్.డి.టి.సి, టి.జి. బి.సి.స్టడీ సర్కిల్, రోడ్ నెంబర్: 8, లక్ష్మి నగర్ కాలనీ సైదాబాద్, హైదరాబాద్‌లో జూన్ 16 నుండి జులై 8 లోగా దరఖాస్తు సమర్పించిన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని అయన తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ. 5000 స్టైఫెండ్, రూ. 5000 బుక్ ఫండ్ ఒక్కసారి మాత్రమే అందించబడుతుందని, లైబ్రరీ సౌకర్యం కూడా కలదని ఆయన పేర్కొన్నారు. టి.జి .బి.సి.ఈ.ఎస్.డి.టి.సి, టి.జి. బి.సి. స్టడీ సర్కిల్, లక్ష్మి నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ - 500059 నందు శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని మొత్తం 150 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపికకు https://tgbcstudycircle.cgg.gov.in అను వెబ్సైటులో దరఖాస్తు చేసుకోగలరు. మరిన్ని వివరాలకు 040-24071178 బీసీ స్టడీ సర్కిల్‌ను సంప్రదించగలరని ఆయన సూచించారు.

లైసెన్స్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన వారు

మెరుగైన సేవలందించాలి : అదనపు కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన భూభారతి సంస్కరణలో భాగంగా, రైతుల భూ, తగాదాలు, రిజిస్ట్రేషన్‌లు, పట్టా భూముల, హద్దుల నిర్ణయం, పనుల నిమిత్తం, రాష్ట్రంలో అన్ని జిల్లాలో గత నెల 26 వ జూన్ నుండీ లైసెన్సు సర్వేయర్లకు శిక్షణ యిచ్చే కార్యక్రమం కొనసాగుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి ముకుంద రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో శిక్షణ పొందుతున్నా వారికి, జిల్లా సర్వే అధికారి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షల నిర్వహణను, జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటాచారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా పొందుతున్న విద్యార్థులు మంచిగా శిక్షణ పొంది, నైపుణ్యం సంపాదించి, మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్, అనంత్ రెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్, రాజేష్, విజయ్ కుమార్, రంగయ్య సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

100 కోట్లు సేకరించిన ఓబెన్ ఎలక్ట్రిక్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ ఓబెన్ ఎలక్ట్రిక్ తన సిరీస్ ఎ రౌండ్ నిధుల సేకరణను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ రౌండ్‌లో మొత్తం రూ. 100 కోట్లను సేకరించినట్లు సంస్థ ప్రకటించింది. ఇందులో జనవరిలో రూ.50 కోట్లు, మేలో పొడిగించిన సిరీస్ ఏ రౌండ్‌లో అదనందా రూ.50 కోట్లు ఉన్నాయి. ఈ రౌండ్‌లో హీలియోస్ హెూల్డింగ్స్, శారద ఫ్యామిలీ ఆఫీస్, కే ఫ్యామిలీ, మరికొందరు పెట్టుబడిదారులు పాల్గొన్నారు. ఈ నిధులను ఓబెన్ ఎలక్ట్రిక్ తన కార్యకలాపాలను విస్తరించడానికి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి, డీలర్ షిప్ నెట్వర్క్‌ను విస్తరించడానికి కొత్త ఎలెక్ట్రిక్ మోటార్ సైకిళ్లను అభివృధి చేయడానికి వినియోగించనుంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి 50కి పైగా నగరాల్లో 150కి పైగా షోరూమ్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది వరకే పంజాబ్, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిశా వంటి కీలక మార్కెట్లలోకి ప్రవేశించింది.

తెలంగాణాలో ఈస్ట్ మ్యాన్ క్లీన్ ఎనర్జీ విస్తరణ

విశాలాంధ్ర - హైదరాబాద్: ఈస్ట్ మ్యాన్ ఆటో, పవర్ లిమిటెడ్ అనేది ఒక సోలార్ ఎనర్జీ ఉత్పత్తులకు సంబంధించిన తయారీ సంస్థ. అది దాని పాదముద్రని తెలంగాణా వరకు శక్తివంతమైన లైన్ అప్ మరియు అత్యధిక పనితీరు తో సోలార్ ఉత్పత్తులను అందిస్తుంది. మన్నికైన, నిలకడైన శక్తి కోసం పెరుగుతున్న డిమాండ్‌కు సమాధానంగా ఈస్ట్ మ్యాన్ ఇప్పుడు గ్రిడ్ టై ఇన్వెర్టర్స్, హైబ్రిడ్ ఇన్వెర్టర్లు, ఆఫ్ గ్రిడ్ ఇన్వెర్టర్లు, లీడ్ యాసిడ్, లిథియం బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్‌ను అందిస్తుంది. వాటన్నింటినీ గృహ అవసరాలకు, కమర్షియల్, పరిశ్రమలో వాడుక కోసం తయారు చేసారు. ఈస్ట్ మ్యాన్ ఇన్వెర్టర్ రేంజ్ అనేది రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా చెయ్యడానికి తయారు చేసారు. అవి వినియోగదారులకు కావాల్సిన సోలార్ ఎనర్జీని గ్రిడ్‌కు తిరిగి వెనక్కి పంపించడానికి సహాయపడతాయి. అలా అది ఎలెక్ట్రిసిటీ బిల్స్‌ను బాగా తగ్గిస్తుంది. పచ్చని శక్తి వాడుకకి మద్దతు ఇస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత విద్య, వైద్యానికే

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పేదలకు విద్య వైద్యం కచ్చితంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం చింతల్ బస్తీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యునాని ఆస్పత్రులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు మెడికల్ స్టోర్‌లో మందుల నిల్వ, క్యాడర్ స్ట్రెంత్, డాక్టర్ల పనితీరుపై పబ్లిక్ హెల్త్ నర్స్ శకుంతలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం మొదలైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధులకు గైర్హాజరైన ఏఎన్ఎంలపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఏఎన్ఎంలకు ఫోన్ చేసి ఎక్కడున్నారు, ఏ వీధిలో వైద్య సేవలు అందిస్తున్నారు, ఆ ఇంటి యజమానితో వారితో మాట్లాడించాలని ఏఎన్ఎంలను సూచించగా వారు సత్వరమే స్పందించి ఇంటి యజమానితో మంత్రి మాట్లాడించారు. మంత్రి వారితో మాట్లాడుతూ వైద్య సేవలు సరిగా అందిస్తున్నారా, మందులు ఇస్తున్నారా, ఏఎన్ఎంలు సరిగా విధులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు చికిత్స అనంతరం మెడిసిన్ అందించాలని అలాగే గర్భిణీలు, బాలింతలు, వృద్ధులకు కచ్చితంగా వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, సిబ్బందిని నియమించడం జరుగుతుందని అన్నారు. ఓపీ వార్డులో ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత లేకుండా చూడాలని అలాగే వైద్య అధికారులు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది, ప్రశంసనీయమైనదని పేదలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో ప్రతివారం పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టల్స్‌ను జిల్లా కలెక్టర్, జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఇన్చార్జ్ మంత్రి తాను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని సానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ సూపర్వైజర్ శకుంతల, కార్పొరేటర్ విజయరెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌ను నెలాఖరు లోగా పూర్తి చేయాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్ జిల్లాకు మంజూరైన 1,409 ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌ను నెలాఖరు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు గాను గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు ఇంటింటా తిరిగి గ్రౌండింగ్ జరిపించాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్లో కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లాకు మంజూరైన ఇళ్లను 10 రోజుల్లోగా వంద శాతం గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, జిల్లాకు 1409 ఇళ్లు మంజూరు కాగా అందులో 516 ఇళ్లు ఇప్పటి వరకు గ్రౌండింగ్ జరిగాయని, ఇంకా 900 ఇళ్లు గ్రౌండింగ్ కావాల్సి ఉందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ మూర్తి కలెక్టర్ కు వివరించగా, కలెక్టర్ స్పందిస్తూ, గ్రౌండింగ్ కు మిగిలిన 900 ఇళ్లను 8 మంది ఏ.ఈలు ఒక్కొక్కరికీ 125 ఇళ్ల చొప్పున బాధ్యత ఇచ్చి ఇంటింటికి తిరిగి వచ్చే వారంలోగా గ్రౌండింగ్ జరిపించేలా చూడాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న, స్థానిక కోటాకు సంబంధించిన వెయ్యి 2 - బి.హెచ్.కే ఇళ్లను కూడా ఎల్ - 2 జాబితాలో ఉన్న వారికి కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా, డబ్బులు లేక ఇందిరమ్మ ఇళ్ల బేస్మెంట్ నిర్మాణం చేయలేక పోతున్న వారికి మహిళా సంఘాలలో చేర్పించి, వారికి లక్ష రూపాయల రుణాలు మంజూరు చేర్పించడం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసుకునేలా కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరి గృహ నిర్మాణ సంస్థ అధికారులు లబ్ధిదారులు, ఇంజనీర్లకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్త, జిల్లా హౌసింగ్ పీ.డీ రమణ మూర్తిలు, డిఇలు, ఏఈ ఇంజినీర్లు పాల్గొన్నారు.

బోనాల పండుగకు అధిక నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సచివాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజిగిరి నియోజకవర్గనికి ఆషాడమాస బోనాల పండుగకు అధిక నిధులు కేటాయించాలని, నూతన దేవాలయాలకు కూడా నిధులు కేటాయించాలని, నియోజకవర్గంలోని పెద్ద దేవాలయాలకు భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే దేవాలయాల్లో రంగం పోతురాజుల వీరంగం చేసి దేవాలయాలకు అధిక నిధులు ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కృషి చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. అందుకుగాను మంత్రివర్యులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తినాకు సంఘీభావంగా నిలబడాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలస్తీన ఇరాన్ దేశాలపై చేస్తున్న దాడులను యుద్ధాలను ఒకరేయిన్ రష్యాల మధ్య జరుగుతున్నటువంటి యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధం వెంటనే ఆపాలని ప్రపంచ శాంతిని కాపాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ ఐక్యరాజ్యసమితిని సమితిని కోరారు. కొన్ని దశాబ్దాలుగా ఇప్పటికే ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల వలన పాలస్తీనా వేలాది మంది ప్రాణాలను కోల్పోయిందని చిన్నారుల భవిష్యత్తును చిదివేసిందని, విద్యాలయాలు వైద్యశాలలో పరిశ్రమలు అన్ని దెబ్బతిన్నాయని ప్రాణ నష్టం విపరీతంగా జరిగిందని అన్నారు పైగా ఇటీవల ఇరాన్ పై కూడా ఇజ్రాయిల్ విరుచుకుపడుతుందని కేవీఎల్ తెలియజేశారు. ఈ యుద్ధాలు ఎవరు చేసినా దేశాలు విధ్వంస మతాయని ప్రజలు నాగరికత బూడిద పాలవుతుందని భవిష్యత్తు అంధకారం అవుతుందని అందుకే యుద్ధాలు నువ్వు వెంటనే ఆపాలని ప్రపంచ శాంతిని కాపాడాలని రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ కోరారు. అఖిలభారత సంఘీభావ సంఘం కమిటీ పిలుపు మేరకు అనగా 2025 శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోర్టులో ఐ షో ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు గౌన్లు ధరించి ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా, పాలసీనాకు సంఘీభావంగా అడ్వకేట్స్ ఫర్ పీస్ అంటూ ప్రపంచ శాంతి వర్ధిల్లాలంటూ యుద్ధం వద్దు మానవ ప్రగతి కావాలి అంటూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కోర్టు బయటి గేటు ద్వారం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కోర్టు బారసోసియేషన్ అధ్యక్షులు ఎస్. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మేధావులంతా యుద్ధాలకు వ్యతిరేకంగా నిలబడాలన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బాసెట్టి కార్తీక్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలకు న్యాయం జరగాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయాలను అమలు చేయాలని కోరారు. న్యాయవాదుల సంఘం నాయకులు, రమణారావు, విష్ణువర్ధన్ రెడ్డి, శాంతి సంఘం నాయకులు డి.శ్రీనివాస్ బి. లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రపంచ ప్రజల జీవితాలను కాపాడాలన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కిషోర్, ప్రముఖ న్యాయవాదులు కే.వీరబాబు, జూపల్లి కృష్ణారావు నల్లబోతు సత్యనారాయణ రెడ్డి, జీవన్, నిర్మల, జ్యోతి, కర్ణం ప్రశాంత్, నారాయణ, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొని యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి ఉద్యమం బలోపేతం కావాలని మాట్లాడారు.

22న సంకల్ప సభకు ఆహ్వానం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి బ్యాంకు కాలనీలో ఉంటున్న ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ షేక్ హుస్సేన్ సాహెబ్‌ను సంకల్ప సభకు హాజరు కావాలని జాతీయ సంగీత కళాకారుల అధ్యక్షులు ఎల్.వి చెన్నారావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గౌరవ సలహాదారులు వి.వీరాంజనేయులు ఆహ్వానించారు. ఈ నెల 22న ఆదివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో జరిగే సంకల్ప సభకు హాజరు కావాలని కాలనీవాసులను వారు కోరారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ 11 సంవత్సరాల్లో దేశ వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులపై ఈ సంకల్ప సభలో చర్చిస్తారని వారు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యోగ డే ఎల్బీనగర్ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యోగా గురువులు, పెద్ద ఎత్తున తరలి వెళ్లిన యోగా శిక్షకులు గుల్ మోర్ పార్క్ పతాంజలి ఉచిత యోగా గురువులు నూనె సురేందర్, గురూజీ గారెల వెంకటేష్ గురూజీ బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భం పురస్కరించుకొని బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి ఒక్కరూ తప్పనిసరి యోగ తమ ఇంటిలో అయిన చేయాలి అని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. ఆరోగ్యం ఉంటే మనం సుఖంగా బ్రతుకుతాం. అందుకని ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు. ప్రతిరోజు 24 గంటలలో ఒక గంట మన ఆరోగ్యం కోసం యోగాకు కేటాయించాలి అని తెలపడం జరిగింది. యువత ఫోన్లు, మిగతా వ్యసనాలకు బానిసలు కాకుండ వ్యాయామం, నడక, యోగ వైపున దృష్టి మళ్లించాలని అని పేర్కొన్నారు. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి అని అన్నారు. జూన్ 21న ఉదయం 6 గంటల నుండి 7 గంటల 30 నిమిషాల వరకు ఇంటర్నేషనల్ యోగ డే గుల్మోర్ పార్క్‌లో జరుగుతుంది కాబట్టి చుట్టుపక్కల ఉన్న ప్రాంత ప్రజలు నేతాజీ నగర్ గుల్మోర్ పార్క్ ప్రజలు ఆదర్శనగర్ ప్రజలు బాపూనగర్ ప్రజలు శేరిలింగంపల్లిలో ఉన్న వివిధ ప్రాంతాల ప్రజలందరూ, తప్పనిసరి పతాంజలి ఉచిత యోగ ఇంటర్నేషనల్ డే కార్యక్రమంలో పాల్గొని యోగా గురువులు చెప్పే ప్రతి విషయాన్ని విని మనం ఆచరించాలని, మన ఆరోగ్యాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. భేరి రామచందర్ యాదవ్ ఈ కార్యక్రమంలో యోగా గురువులు నూనె సురేందర్ గురూజీ గారెల వెంకటేష్ గురూజీ బిల్డర్ వెంకటేశ్వర్లు, సినిమా ప్రొడ్యూసర్ రాజేంద్రప్రసాద్, సాయినాథ్, నాగరాజు, బాలకృష్ణ రెడ్డి, కిమ్ చంద్ హరి ఓం, తివారి జి, గాయత్రి, విజయ, ఉదయ్‌కుమారి, రమాదేవి, రాధ, పద్మ, రాధా రాణి రెడ్డి, మమత, అమృత, సాయి ప్రియ, గోపి, యువత ప్రసాద్, గణేష్, యోగా శిక్షకులు పెద్ద ఎత్తున తరలి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

మల్కాజిగిరి ప్రజలకు ఏవోసీ సెంటర్ చక్రబంధం నుంచి విముక్తి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి ప్రజలకు ఏవోసీ సెంటర్ చక్రబంధం నుంచి విముక్తి లభించనుంది. త్వరలోనే మల్కాజిగిరి ప్రజలు శుభవార్త వినబోతున్నారు. కంటోన్మెంట్ మిలటరీ ఏరియాలలో అదనపు రోడ్ల ఆర్కేపురం, ఉత్తమ్ నగర్, మహేంద్ర హిల్స్, ఏఓసి సెంటర్ల నుండి కొత్త రోడ్లు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించినట్లు మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా రక్షణ శాఖ వారికి ప్రభుత్వ భూములు ఇచ్చేందుకు ఒప్పుకున్నారని, దీనికోసం ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్, తిరుమలగిరి పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలంగా అదనపు రహదారులు నిర్మించబోతున్నారనీ ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

జూలై 9న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : కార్మికుల ఉద్యోగ భద్రతను తొలగిస్తూ, పెట్టుబడిదారుల ప్రయోజనాలకే మక్కువ చూపుతున్న కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్, ఏఐటీయూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్‌రావులు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్లన కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది. కనీస వేతనం నెలకు రూ.26,000గా నిర్ణయించాలి. ఔట్‌సోర్స్, ఫిక్స్ టర్మ్, ట్రైనీలు, అప్రెంటిస్‌లను క్యాజువలైజ్ చేయకూడదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై సెంట్రల్ ఎక్సైజ్ తగ్గించాలి. జీఎస్టీను ఆహారం, మందులు, వ్యవసాయ ఉత్పత్తులపై తొలగించాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టానికి హామీ ఇవ్వాలి. ఉద్యోగ భద్రతపై ప్రభావం పడుతుందన్నారు. 10 గంటలకు పెంచే ప్రయత్నం జరుగుతున్నదని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశ వ్యాపిత సమ్మె చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, స్థానిక కార్మిక సంఘాలు ఉద్యోగ ఫెడరేషన్‌లు పిలుపునిచ్చాయని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రిక చేయాలి లాంటి మొత్తం 20 డిమాండ్లను నెరవేర్చి వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా సిఐటియు అధ్యక్షుడు ఎర్ర అశోక్, టీయూసీఐ ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ లక్ష్మయ్య, టిఆర్ఎస్ కె వి ప్రభాకర్, సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, ఆశా వర్కర్స్ నేత రేవతి కళ్యాణి, మున్సిపల్ నాయకులు ఎస్.శ్రీనివాస్, సిఐటియు నాయకులు రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంబేద్కర్ సేన అఖిల భారత కార్యదర్శి రెడ్డిమల్ల శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులుగా, సోషల్ మీడియా ఇంచార్జీగా చేవెళ్ల మున్సిపల్ దామరగిద్ద వార్డుకి చెందిన బోడ ప్రకాష్ నియామకమయ్యారు. అంబేద్కర్ సేన అఖిల భారత కార్యదర్శి రెడ్డిమల్ల శ్రీనివాస్ శుక్రవారం నియామక పత్రాన్ని బోడ ప్రకాష్ కు అందజేశారు. ఈ సందర్భంగా బోడ ప్రకాష్ మాట్లాడుతూ నాపై నమ్మకముంచి పదవిని కట్టబెట్టినందుకు నమ్మకాన్ని వమ్ముచేయకుండా అందరిని కలుపుకుని అంబేద్కర్ సేన అబివృద్ధికి పాటుపడుతానన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తనవంతు కృషిచేస్తానన్నారు. అనంతరం పదవి ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదులు తెలియజేశారు.

చర్లపల్లి చెరువు అభివృద్ధికి హైడ్రా శ్రీకారం

అధికారులతో కమిషనర్ రంగనాథ్ సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరానికి అతి సమీపంలో ఉన్న చర్లపల్లి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న దిశగా హైడ్రా కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 58 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును ఆధునీకరించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) సౌమ్య మిశ్రా ఆహ్వానంపై చెరువును సందర్శించారు. పర్యావరణ అనుకూలతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాన్ని పర్యాటక ఆకర్షణగా మలచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ, జైళ్ల శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. చెరువు పరిశుభ్రత, జీవవైవిధ్య పరిరక్షణ, ప్రజలకు విశ్రాంతి ప్రదేశంగా మార్చే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చెరువుకు పూర్తిగా ఫెన్సింగ్ ఏర్పాటు, కట్టను బలోపేతం చేయడం, సుమారు 3 కిలోమీటర్ల నడక దారి ఏర్పాటు, చిన్న చిన్న పార్కులు (మినీ పార్కులు) నిర్మాణం, విశ్రాంతికి సీటింగ్ ఏర్పాటు, భద్రత కోసం సీసీ కెమెరాల అమరిక వంటి ప్రధానమైన ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ "ఈ చెరువు హైదరాబాద్‌కు ఒక సహజ వనరుగా ఉండటంతో పాటు పర్యాటక అభివృద్ధికి అనేక అవకాశాలు కలిగి ఉంది. ప్రాజెక్టు కార్యాచరణపై సమగ్ర డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతో ఈ ప్రాజెక్టును త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అధికార వర్గాలు వెల్లడిరచాయి.

24న కాంగ్రెస్ నూతన కమిటీల సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ అధ్యక్షతన గాంధీ భవన్‌లో 24న ఉదయం 11 గంటలకు పీసీసీ రాజకీయ వ్యవహారాల (పొలిటికల్ అఫైర్స్ కమిటీ పీఏసీ) కమిటీ సమావేశం, అనంతరం పీసీసీ సలహా కమిటీ (పీసీసీ అడ్వైజరీ కమిటీ పీఏసీ) సమావేశాలు జరగనున్నాయి. మధ్యాహ్నం తర్వాత నూతనంగా నియామకం అయిన టీపీసీసీ ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు పాల్గొంటారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదు : కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సూరారంలోని పలు కాలనీల్లో బోరు బావులు ఎండి తీవ్ర నీటి సమస్య ఏర్పడడంతో ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు కొలను హన్మంత్ రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. అనంతరం ప్రజల విన్నపం మేరకు ఆయా కాలనీలో పర్యటించి స్థానికంగా ఉన్న నీటి కుంటను కబ్జా చేయడం ద్వారా నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సర్వే నెంబర్.21లో ఉన్న కొత్త కుంట చెరువును కొందరు బిఆర్ఎస్ నాయకులు మట్టితో పూడ్చి చెరువును కబ్జా చేసి రూములు నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోనీ పలు చెరువులను స్థానిక ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలు చేసి, ఆక్రమలకు పాల్పడ్డా వారిని వదిలే ప్రసక్తి లేదని తెలియజేశారు. కొత్త కుంట చెరువును ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని, ఆక్రమణకు గురైన చెరువులను పునర్మించే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోల్ల సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్న శ్రీధర్ రెడ్డి, శ్రీ రామ్ నగర్, కృష్ణనగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిపాలన భవనం ముందు అసిస్టెంట్ వార్డెన్ పోస్టులకు అప్లై చేసుకున్న అభ్యర్థుల ఆందోళన దిగారు. హాస్టళ్లకు సంబంధించిన మహిళలకు 10, పురుషులకు 10 అసిస్టెంట్ వార్డెన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన వర్సిటీ అధికారులు శుక్రవారం అసిస్టెంట్ వార్డెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు తెలపడంతో వివిధ జిల్లాల నుండి అభ్యర్థులు పెద్ద ఎత్తున్న తరలివచారు. అయితే యూనివర్సిటీ అధికారులు ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్టు బోర్డు ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు ఆగ్రహానికి గురై ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అభ్యర్థులు సర్ది చెప్పారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇంటర్వ్యూ వాయిదా వేయడం పట్ల అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్టర్ హామీ ఇవ్వడంతో అభ్యర్థులు ఆందోళన విరమించారు.

జర్నలిస్ట్ ను బెదిరించిన వ్యక్తిపై కేసు..

విశాలాంధ్ర - మేడిపల్లి : విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్ట్ ను బెదిరించడంతో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండల న్యూస్ తెలంగాణ దినపత్రిక జర్నలిస్టు మరాటి మచ్చగిరి విధి నిర్వహణలో భాగంగా అక్రమ నిర్మాణంపై కథనం వ్రాయడంతో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీకి చెందిన దయ్యాల మహేష్ అను వ్యక్తి జర్నలిస్ట్ ఇంటికి వెళ్ళి నువ్వు నా ఇంటిపై కథనం ఎలా వ్రాశావని, నీ అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడంతో ఆ వ్యక్తిపై విచారణ జరిపి 351(2), 351 బిఎన్ఎస్ సెక్షన్ల కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మందకృష్ణ మాదిగను కలిసిన సురేందర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను ఆయన నివాసంలో తెలంగాణ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.సురేందర్ మర్యాద పూర్వకంగ కలిసారు. పద్మశ్రీ అవార్డు పొందిన తర్వాత తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవేంద్ర ప్రసాద్‌తో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగ ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలి

కమీషనర్ ఆర్‌వి కర్ణన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ప్రజలు పరిశుభ్రత పాటించాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ నగర వాసులను కోరారు. శుక్ర వారం కమీషనర్ ముషీరాబాద్ సర్కిల్ గాంధీ నగర్, అరుంధతి కాలనీ, కవాడిగూడ పాఠశాల, ఇందిరా పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, మలేరియా వ్యాధికి గురికాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఇంట్లో, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు దోమల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కవాడిగూడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు విద్యార్థులకు కమిషనర్ వివరించారు. అనంతరం కమిషనర్ ఇందిరా పార్కును సందర్శించారు. అక్కడ వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకర్స్ సమస్యలను పరిష్కరించాలని యు.బి.డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ సందర్శకుల వసతుల కోసం కొన్ని సూచనలు చేశారు. పార్కులో పలు ప్రాంతాల్లో వాటర్ లీకేజీ అవుతున్న దృష్ట్యా వాటిని ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో మరమ్మత్తులు చేసి లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పని చేయని ఫౌంటెన్ తొలగించాలని, యోగా షెడ్ వద్ద ఉన్న ప్లాస్టిక్ ఇతర చెత్తను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమీషనర్ రామానుజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలు లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కమిషనర్ ఆర్ వి కర్ణన్

ఆస్తిపన్ను లక్ష్యాన్ని పూర్తిచేయాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. అడిషనల్, జోనల్, డిప్యూటీ కమిషనర్లతో శుక్రవారం ఆస్తిపన్ను వసూలు, ఫాగింగ్, పూడికతీత అంశాలపై సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బిల్లు కలెక్టర్లకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ట్యాక్స్ కలెక్షన్ తప్పని సరిగా చేయాలని అన్నారు. జోనల్ కమిషనర్ సర్కిల్ వారీగా సమీక్షించి నిర్దేశించిన లక్ష్యం మేరకు టాక్స్ వసూలు చేయని బిల్లు కలెక్టర్‌లపై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు చేపట్టే ఫాగింగ్‌పై పర్యవేక్షణకు ఒక వార్డుకు ఒక్క సూపర్వైజర్‌ను ఏర్పాటు చేయాలని, రెండు అంత కంటే ఎక్కువ వార్డులకు సూపర్ వైజర్లు నియమించవద్దని హెల్త్ అడిషనల్ కమీషనర్ ఆదేశించారు. జోనల్ సీనియర్ ఎంటరాలజిస్ట్‌ల కు ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. పార్క్‌లలో దోమల ఉత్పత్తి కాకుండా ఫాగింగ్ చేయలన్నారు. డి-సిల్టింగ్ లో కొన్ని సర్కిల్ వెనుకబడి ఉన్న ఈ ఈ లు, డిప్యూటీ ఈఈల పై షోకాజు నోటీసులు జారిచేయాలని సిఈ ని ఆదేశించారు.

మెరుగైన సేవలందించేందుకే పర్యటన

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ చుట్టుపక్కల వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల అభివృద్ధిని పరిశీలించుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకుగాను ఈ పర్యటన ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శంషాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సంబంధిత శాఖల సెక్రటరీలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని గ్రామాలు ఓఆర్ఆర్ అవతలి వైపు, ఓఆర్ఆర్ పక్కన గల గ్రామాలు, జిహెచ్ఎంసిలో విలీనమైనందున ఆయా గ్రామాల మౌలిక సదుపాయాలు ఏమేరకు అభివృద్ధి చెందుతున్నాయో తెలుసుకోవటానికి ఈ మున్సిపాలిటీని సందర్శిస్తున్నానని ముందుగా నేడు శంషాబాద్ మున్సిపాలిటీని సందర్శిస్తున్నట్లు తెలిపారు. త్రాగునీటి సౌకర్యం సమీక్షించగా దానిపై జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాలనీలలో పైప్‌లైన్లను వేయాలని అందుకు సంబంధించిన ఎస్టిమేట్లను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులు ఆదేశించడం జరిగిందని, జిల్లాలో ఎక్కడ తాగునీటి కొరత లేకుండా కావలసిన నిధులను గ్రామ పంచాయతీలకు, మునిసిపాలిటీలకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. తదుపరి ముఖ్య కార్యదర్శి పన్ను వసూళ్లలో ఈ సంవత్సరం 23 శాతం అతి తక్కువగా చేయడంపై లక్ష్యాలను అధిగమించాలని, కొత్త ఇండ్ల అసెస్మెంట్‌లను చేయించి మున్సిపాలిటీల ఆదాయం పెంచాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో విద్యుత్ దీపాలు వార్డుల్లో నాలాల శుభ్రత తదితర అంశాల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పని చేయాలని అధికారులకు ముఖ్య కార్యదర్శి సూచించారు. అనంతరం కోత్వాల్ గూడాలో నిర్మాణంలో ఉన్న హెచ్ఎండిఏ ఎకో పార్కును సందర్శించి అక్కడి పక్షుల పార్కులోని వివిధ దేశాల పక్షులు, గార్డెనింగ్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని నిర్వాహకులకు తెలియజేశారు. తదుపరి రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇలంబర్తి, హెచ్ఎండిఎ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డిఓ వెంకట్ రెడ్డి, పీ.డి హౌసింగ్ నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - దుండిగల్: పర్యావరణ పరిరక్షణ కోసం సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించడం జరిగిందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని మున్సిపల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ అంజయ్య హెచ్చరించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు. అనంతరం సింగల్ యూస్ ప్లాస్టిక్ ఉపయోగించే కిరాణా షాపులు, హెూటల్స్, చికెన్, మటన్ దుకాణాలపై తనిఖీలు చేసి నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, 75 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. అదేవిధంగా ప్లాస్టిక్ బదులు అందరూ జూటు బ్యాగులు, చేతి కర్ర సంచులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ చలసాని కల్యాణ మండపంలో మున్సిపల్ సిబ్బందికి ప్రభుత్వ ఆరోగ్యశాఖ సిబ్బందిచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. పారిశుద్ధ్య కార్యక్రమాలలో నిత్యం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తూ స్వచ్ఛ తుర్కయాంజల్ కోసం పాటుపడుతున్న సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని, సిబ్బంది శానిటేషన్ మాస్కులు గ్లౌసులు ధరించాలని సూచించారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

విశాలాంధ్ర - కాప్రా : మావోయిస్టులతో శాంతి చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను, మావోయిస్టులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, నరమేధానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోకల సత్య ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఈసీఐఎల్‌లోని జిల్లా ఆఫీసులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోకల సత్యప్రసాద్ మాట్లాడుతూ ఒకవైపు ప్రజలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మావోయిస్టులు కేంద్రంతో చర్చలు జరుపుతాం, శాంతియుతంగా సమస్యను పరిష్కరిద్దాం, ఆయుధాల విషయాన్ని కూడా చర్చిద్దామంటూ కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేశారనీ, లేఖలు రాశారని గుర్తు చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం మూర్ఖంగా మావోయిస్టులను, గిరిజనులను కాల్చి చంపే నరహంతక చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. చత్తీస్‌ఘడ్ అడవుల్లో కార్పొరేట్ సంస్థలకు అక్కడ ఉండే బొగ్గు, ఇనుము, సున్నపురాయి, డోల మైట్, బాక్సైట్ ఖనిజ సంపాదనంతా ధారాదత్తం చేయడానికి ఆటంకంగా ఉన్నది, కాబట్టి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో దేశం ఒక విచిత్రమైన సంక్షోభంలోకి పడిపోయిందన్నారు. దండకారణ్యం నెత్తురోడుతోందని, విప్లవోద్యమం అణిచివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కగార్ ఆదివాసీ హననానికి కారణం అవుతున్నదని అన్నారు. కార్పొరేట్ దోపిడీని వ్యతిరేకిస్తున్న ఆదివాసీ సమాజానికి అండగా ఉన్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడం ద్వారానే పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడగలమన్న భావనతో మోడీ ప్రభుత్వం దేశ ప్రజలపై యుద్ధం చేస్తున్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చల ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి శాంతియుత వాతావరణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూన్ 23న అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే "ఆపరేషన్ కగార్"ను ఆపాలని, ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఎం.శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రజిని, కోమల, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐదు పోలవరం ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పోలవరం ప్రాజెక్టు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ లో కలిపిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈనెల 25వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్య మంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించబోయే సమా వేశంలో ఈ అంశంపై చర్చించాలని సూచిం చారు. పోలవరం ముంపుపై, ఏపీలో కలిపిన భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలన్న అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఏపీలో కలిపిన గ్రామాల్లోని పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయ గూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య వివక్షకు గురవుతూ ఏ ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్నారని వివరించారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని, లేదంటే ఏ ఒక్క ఏడాదిలో కూడా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని తెలిపారు. పోలవరం స్పిల్‌వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ 12వ మహాసభ శంకర్‌పల్లి మండల కేంద్రంలోని బివిఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ మండల కార్యదర్శి పి.సుధీర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు మోడీ ఇచ్చిన వాగ్దానాలు ఉద్యోగాలు సిస్ బ్యాంకులోని ఉన్న ఖాతాలోపు పేద ప్రజలకు 15 లక్షల రూపాయలు ఇప్పిస్తానని చెప్పిన వాగ్దానాలు అమలు పరచలేదని మోడీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని పార్లమెంట్లో రైతులకు ఇచ్చిన నల్ల చట్టాలపైన మాట తప్పిందన్నారు. మావోయిస్టుల పైన జరుపుతున్న హత్యకాండను తక్షణమే ఆపి, వారితో శాంతి చర్చ జరపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచాలని డబుల్ బెడ్ రూములు ఇండ్ల స్థలాలు రైతుబంధులు తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆకాష్ ఎడ్యుకేషన్ సెంటర్, సీఎంఎస్ కాలేజ్ నూతన బ్రాంచ్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చందానగర్ డివిజన్ పరిధిలోని తార నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకాష్ ఎడ్యుకేషన్ సెంటర్, సీఎంఎస్ కాలేజ్ నూతన బ్రాంచ్‌ను గౌరవ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తార నగర్‌లో ఆకాష్ ఎడ్యుకేషన్ సెంటర్, సిఎంఎస్ కాలేజ్ నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని పిఎసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఆకాష్ సిఎంఎస్ విద్య సంస్థలు అగ్రగామిగా ఉన్నాయి అని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి దోహదపడుతుంది అని, మెడికల్ (నీట్), ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షాల కోసం పోటీ పడే విద్యార్థులకు ఇక్కడి విద్య బోధన ఎంతగానో ఉపయోగపడుతుంది అని గాంధీ తెలిపారు. విద్యార్థులు జీవితంలో గొప్ప గొప్ప లక్ష్యాలు పెట్టుకొని వాటిని సాధించే క్రమంలో సడలని పట్టుదల, మంచి క్రమ శిక్షణ, కఠోర శ్రమతో పట్టుదలతో అనుకున్న లక్ష్యం చేరుకునే వరకు విశ్రమించకూడదు అని, మంచి చదువులు చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, తల్లిదండ్రులకు, సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించి, జీవితంలో గొప్పగా ఎదగాలని కలలను సాకారం చేసుకోవాలని పిఏసీ చైర్మన్ విద్యార్థులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆకాష్ దక్షిణ ఆపరేషన్ హెడ్ నిశాంత్ శ్రీ వత్సవ, చీఫ్ ఆకాడమిక్ బిజినెస్ హెడ్ అమిత్ కుమార్ ఉరిటీ, సీఎంఎస్ కాలేజ్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు మారబోయిన రాజు యాదవ్, నాగరాజు, మల్లేష్ యాదవ్, విష్ణు వర్ధన్‌రెడ్డి, శశాంక్, పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశాలి బిజినెస్ నెట్‌వర్క్ మెంబర్‌షిప్ పోర్టల్ ప్రారంభం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : పద్మశాలి కమ్యూనిటీ వ్యాపార అభివృద్ధి, ఐక్యత కోసం డిజిటల్ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు పద్మశాలి బిజినెస్ నెట్వర్క్ అధికారిక మెంబర్‌షిప్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు పద్మశాలి బిజినెస్ నెట్వర్క్ గ్లోబల్ ప్రెసిడెంట్ డా. ఇప్పలపల్లి రమేష్ తెలిపారు. ఈ పోర్టల్ ప్రారంభోత్సవం 100 మందికి పైగా సభ్యుల సమక్షంలో ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా జిల్లా, పట్టణ, మండల స్థాయిలో పద్మశాలి బిజినెస్ నెట్వర్క్ చాప్టర్లను ప్రారంభించేందుకు, సభ్యులను నమోదు చేసేందుకు ఈ వెబ్‌సైట్‌ను రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా గ్లోబల్ ప్రెసిడెంట్ డా. ఇప్పలపల్లి రమేష్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో ఉన్న పద్మశాలి వ్యాపారస్తులను ఒక గొప్ప నెట్‌వర్క్ ద్వారా అనుసంధానించి, వారిలో పరస్పర బిజినెస్ రిఫెరల్స్ సృష్టించటం, డిజిటల్ సపోర్ట్, బిజినెస్ ట్రైనింగ్స్ అందించటం తమ లక్ష్యం అన్నారు. ప్రతి 15 నుండి 25 మంది వ్యాపారస్తులతో కలిసి తమ ప్రాంతంలో ఒక చాప్టర్ ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ చాప్టర్‌ను ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ రఘురాం, కోశాధికారి గంజి వెంకటేష్, డైరెక్టర్లు శ్రవణ్, వరుణ్, అరవింద్, కిశోర్, నవకాంత్, విజిత్, మహేష్ మంద తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

విశాలాంధ్ర - ఘట్కేసర్ : దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు మావోయిస్టులు, అమాయక గిరిజనులపై క్రూరమైన దాడులు జరిపి భయానక నరమేధాన్ని కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తుందని, వెంటనే అపరేషన్ కగార్ ఆపాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఘట్కేసర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఛలో రాజ్‌భవన్ గోడపత్రికను విడుదల చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అటవి సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మావోయిస్టు హత్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాతికంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలను సమస్యగా చూపి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులను అంతరం చేస్తామని ప్రకటించడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తుందని ధ్వజమెత్తారు. ఇలాంటి భయానక దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడడానికి ప్రజలంత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసులను చంపుతున్నారని ఆరోపించారు. సంపదను బడాబాబులకు కట్టబెట్టాలన్నదే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. మోడి ప్రభుత్వం ఉగ్రవాదుల సమస్య పరిష్కారానికి పాకిస్తానుతో సంప్రదింపులు జరుపుతున్నప్పుడు రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో శాంతి చర్చలు ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్, ఘట్కేసర్ మండల కార్యదర్శి సంపంగి శివ, ఉపాధ్యక్షుడు గిరిబాబు, మండల కార్యవర్గం సభ్యులు శివకుమార్, వెంకటేష్, చెన్నయ్య, అంజి, శ్రీను, పద్మ, పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

యోగాకు సాగరతీరం ముస్తాబు

- నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- గిన్నీస్ రికార్డు లక్ష్యంగా లక్షలాది మందితో అభ్యాసం
- ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర ప్రముఖుల రాక
- ఉదయం 6.30 గంటలకు ఆరంభం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: శరీరం, ఆత్మ కలయిక యోగా... దేహాన్ని చైతన్యపరిచి, మనసుకు ఉత్తేజం కలిగించేది యోగా... సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే ఈ ప్రాచీన విద్య పరమావధి. ఈ అపూర్వ యోగా విద్యను ప్రజలందరి దరికి చేర్చడం ద్వారా వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహా ప్రదర్శనకు విశాఖ సాగర తీరం సిద్ధమయింది. నెల రోజులపాటు వివిధ వర్గాల ప్రజల భాగస్వామ్యంతో యోగా శిక్షణ పూర్తయింది. యోగాంధ్ర చివరి రోజు కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ప్రదేశాల్లో యోగా ప్రదర్శన జరగనుంది. దీనిలో భాగంగా విశాఖపట్నం సముద్ర తీరంలో గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సుమారు 5 లక్షల మందితో శనివారం యోగా ప్రదర్శన నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ యోగా కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చే ప్రజలంతా భాగస్వాములు కానున్నారు.

ప్రదర్శనకు భారీ ఏర్పాట్లు

విశాఖ సముద్ర తీరాన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి భీముని పట్టణం వరకు మొత్తం 26 కిలోమీటర్ల మేర యోగాభ్యాస ప్రదర్శనను నిర్వహిస్తారు. దీనికోసం మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌కు గెజిటెడ్ స్థాయి అధికారిని ఇంఛార్జ్‌గా నియమించారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో యోగా శిక్షకులు, ముగ్గురు ప్రదర్శకులు, 10 మంది వాలంటీర్లు, ఒక ఏఎన్ఎం, ఆశా వర్కర్, పోలీసు అధికారి, గిన్నీస్ రికార్డు నమోదు కోసం కంపార్ట్‌మెంట్‌కు 10 మంది చొప్పున మొత్తం 4,600 మంది ప్రతినిధులు, ఫుడ్ ఇంఛార్జ్, ఇద్దరు సూపర్‌వైజర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, నలుగురు పారిశుధ్య పనివారు ఉంటారు. యోగా ప్రదర్శకులు 1,438 మంది, శిక్షకులు 907 మంది ఈ కంపార్ట్‌మెంట్‌లలో సిద్ధంగా ఉంటారు. మొత్తం 4,280 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా 35 మంది పాములు పట్టేవారితో పాటు పెద్ద సంఖ్యలో గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్లతో పాటు అఖిల భారత అధికారులు సైతం బాధ్యత తీసుకున్నారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో తాగు నీరు, 100 మందికి ఒకటి చొప్పున మరుగుదొడ్లు, స్ట్రెచర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, స్నాక్స్ బాక్సులు సిద్ధంగా ఉంటాయి. ప్రదర్శనలో పాల్గొనే ప్రతి ఒక్కరికి యోగా మేట్, టి షర్ట్ పంపిణీ చేస్తారు. యోగా ప్రదర్శన అనంతరం సాధకులు వీటిని తీసుకువెళ్లిపోవచ్చు. కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేశారు, అందరికీ కనిపించే విధంగా ఎల్ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేశారు. కొన్ని ప్రదేశాల్లో విష పురుగులు చేరకుండా మూడుసార్లు క్రిమిసంహారక మందులను పిచికారీ చేసి కంపార్ట్‌మెంట్లను సిద్ధం చేశారు. అవసరమైన అత్యవసర మందులు, 104 వాహనాలతో పాటు ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక 5 పడకల ఆసుపత్రిని సిద్ధం చేశారు. మొత్తం 326 వైఫై పాయింట్లు, 335 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అధికారులను, ప్రజలను వేదికల వద్దకు తరలించడానికి మొత్తం 9,995 వాహనాలను వినియోగిస్తున్నారు. వీటిలో 7,295 బస్సులు, 2,500 ఆటోలు, 200 మేక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. మొత్తం 75 పార్కింగ్ ప్రదేశాలతో పాటు అభ్యాసకులను ఏ కంపార్ట్‌మెంట్ వద్ద దించారో, అక్కడే వారిని తిరిగి వాహనంలోకి ఎక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌కు బస్సులను సైతం మ్యాపింగ్ చేశారు. మొత్తం 10 వేల మంది పోలీసులు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. విశాఖ నగరం అడుగడుగునా పోలీసు వలయంతో నిండిపోయింది.

18 క్రీడా మైదానాల్లో ప్రదర్శనలు

మొత్తం 26 కిలోమీటర్ల సాగర తీరంతో పాటుగా మరో 18 క్రీడా మైదానాల్లో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏయూ మైదానం, చినగదిలి గోల్ఫ్ క్లబ్, పీఎం పాలెం క్రికెట్ స్టేడియం, కొమ్మాది స్టేడియం, పోర్ట్ స్టేడియం, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం తదితర 18 క్రీడా మైదానాలు, మరో 30 అదనపు ప్రాంతాలలో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహిస్తారు.

మోదీకి ఘనస్వాగతం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రి ఏడు గంటలకు విశాఖ నగరానికి చేరుకున్నారు. ఆయనకు ఎయిర్ పోర్ట్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘన స్వాగతం పలికారు. ఆర్కే బీచ్‌లోని యోగా ప్రధాన వేదిక వద్దకు శనివారం ఉదయం 6.25కి ప్రధాని వస్తారు. 6.30 నుంచి 7.45 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో

పాల్గొంటారు. మోదీతో పాటు కేంద్ర ఆయుష్ శాఖామంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్, చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు, నేవీ, కోస్ట్ గార్డ్, యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ పాల్గొంటారు. మోదీ... ఐఎన్ఎస్ డేగా నుంచి నావికాదళ ప్రత్యేక అతిథి గృహానికి చేరుకొని రాత్రి బస చేశారు.

ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలొచ్చాయ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఎడ్‌సెట్ 2025 ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫలితాల వివరాలను ఎక్స్ వేదికగా శుక్రవారం పోస్టు చేశారు. గణితం, భౌతిక శాస్త్రాలు, సామాజిక అధ్యయనాలు, జీవశాస్త్రం, ఇంగ్లీషు మొత్తం ఐదు విభాగాల్లో 99.42 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 17,795 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 14,527 మంది అర్హత సాధించారు. ర్యాంక్ కార్డులను https://cets.apsche.ap.gov.in/EDCET/Edcet/EDCET_GetRankCard.aspxలో అందుబాటులో ఉంచారు. ఈ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును తెలుసుకోవచ్చు. మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009 ద్వారాను ఫలితాలను పొందే అవకాశాన్ని కల్పించింది. ముందుగా ఏపీ వాట్సప్ నంబర్‌కు హాయ్ మెసేజ్ చేయాలి. తరువాత సెలక్ట్ సర్వీస్‌లో విద్యాసేవలు ఆప్షన్‌ను ఎన్నుకుని, అందులో ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలపై క్లిక్ చేసి...హాల్ టికెట్, రిజిస్ట్రేషన్ల నంబరును ఎంటర్ చేసిన వెంటనే ఫలితాలు, ర్యాంక్ కార్డు వస్తుంది.

ఆర్టీఈ రెండో విడత జాబితా విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు (ఆర్టీఈ) చట్టం 12(1)సీ ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి రెండో విడత లాటరీ ఫలితాల తుది జాబితా విడుదల చేసినట్టు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,583 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. సమాచారం తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడంతో పాటు, https://cse.ap.gov.in వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంటుదన్నారు. పాఠశాలలకు కేటాయించిన విద్యార్థులు తగిన ధృవీకరణ పత్రాలతో ఈ నెల 21వ తేదీ నుంచి 28 లోపు సంబంధిత పాఠశాలలకు వెళ్లి తమ ప్రవేశాలను నిర్ధారించుకోవచ్చన్నారు. ప్రవేశాలను సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు (ఏపీసీలు) ప్రత్యేకంగా కేటాయించిన లాగిన్ల ద్వారా నిర్ధారిస్తారు. పాఠశాల యాజమాన్యాలకు సందేహాలుంటే సంబంధిత ఎంఈవో, డీఈవో, ఆర్జేడీలను సంప్రదించాలని సూచించారు.

25న డీఎస్సీ హాల్ టికెట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మారిన డీఎస్సీ పరీక్షల హాల్ టికెట్లు ఈనెల 25న విడుదల కానున్నాయి. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసింది. 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన అన్ని పరీక్షలను మార్పు చేసింది. ఈ పరీక్షలను జులై ఒకటి, రెండు తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను 25వ తేదీన అందుబాటులో ఉంచారు. పరీక్ష తేదీలతో పాటు, పరీక్షా కేంద్రాలు మారనున్నాయి. మారిన హాల్‌టికెట్లను 25 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఈ మార్పుల దృష్ట్యా డీఎస్సీ అభ్యర్థులు హాల్ టికెట్లను మారో మారు డౌన్‌లోడ్ చేసుకోవాలని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సూచించారు. ఈ రెండు రోజులు మినహా మిగతా అన్ని పరీక్షలు యథాతథంగా షెడ్యూల్ ప్రకారం జరగనున్నాయి. తొలుత ఈ నెల ఆరో తేదీ నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ ఆన్‌లైన్ రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ షెడ్యూలు ఇచ్చింది. మరోవైపు ఆర్‌ఆర్‌బీ, ఎస్టీపీసీ, యూజీసీ నెట్, టెట్, మెగా డీఎస్సీ పరీక్షల తేదీల్లోను చాలా మందికి ఒకే తేదీల్లో వచ్చాయి. వాటివల్ల ఆయా పరీక్షలకు ఏకకాలంలో హాజరవ్వడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డీఎస్సీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

భీమవరంలో దాడిపై చర్యలు

డీజీపీకి మంత్రి లోకేశ్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భీమవరంలో విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డీజీపీని ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పట్టపగలు విద్యార్థులపై అరాచక వ్యక్తులు దాడి చేసిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. పౌర సమాజంలో ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పారు. ప్రభుత్వం ఈ చర్యను సహించదని ఉద్ఘాటించారు. నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని లోకేశ్ వివరించారు. గురువారం సాయంత్రం కాలేజీ బస్సులో వెళుతున్న విద్యార్థిని యువకులు దుర్భాషలాడారు. బస్సు దిగి వచ్చి ఎందుకు తిట్టారని అతడు ప్రశ్నించగా యువకులు మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. అతడు వెళుతున్న బస్సును యువకులు వెంబడించి వెకిలి చేష్టలు, డ్యాన్సులు చేశారు. వారి అలజడికి వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. ఈ విషయమై ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ హల్‌చల్ చేసిన యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిధి-ఖర్చులో బీజేపీ టాప్

మొత్తం విరాళాల్లో 84.18 శాతం, వ్యయంలో 45 శాతం ఈ పార్టీదే: ఏడీఆర్

న్యూఢిల్లీ: లోక్‌సభకు 2024లో జరిగిన ఎన్నికలప్పుడు అత్యధిక విరాళాలు పొందడమే కాకుండా ఎక్కువగా ఖర్చు పెట్టిన పార్టీగా బీజేపీ నిలిచింది. మొత్తం 32 జాతీయ, ప్రాంతీయ పార్టీలు జమిలి ఎన్నికలప్పుడు పొందిన నిధులు-పెట్టిన ఖర్చుపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్స్ రీఫార్మ్స్ (ఏడీఆర్) శుక్రవారం నివేదిక విడుదల చేసింది. అన్ని పార్టీలకు కలిపి రూ.7,445.56 కోట్లు నిధులు రాగా ఇందులో రూ.6,268 కోట్లు అంటే 84.18 శాతం బీజేపీ పొందింది. కాంగ్రెస్‌కు 7.96 శాతం అంటే రూ.592.48 కోట్లు వచ్చాయి. ఎన్నికల సంఘానికి సమర్పించిన లెక్కల ఆధారంగా ఏడీఆర్ నివేదిక వెలువడింది. ఐదు జాతీయ పార్టీలకు రూ.6,930.24 కోట్లు (93.08శాతం), ప్రాంతీయ పార్టీలకు రూ.515.32 కోట్లు (6.92శాతం) సమకూరినట్లు తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్ తర్వాత స్థానాల్లో రూ.171.753 కోట్ల (2.31శాతం)తో వైసీపీ, రూ.107.93 కోట్లు (1.45శాతం)తో టీడీపీ, రూ.62.74 కోట్లు (0.85శాతం)తో సీపీఎం ఉన్నాయి. ఎన్నికల వ్యయంలోనూ బీజేపీ ముందుందని నివేదిక వెల్లడించింది. అన్ని పార్టీలు కలిపి రూ.3,351.81 కోట్లు ఖర్చు చేయగా, ఇందులో 44.56 శాతం అంటే రూ.1,493.91 కోట్లను బీజేపీ ఖర్చు చేసినట్లు పేర్కొంది. కాంగ్రెస్ ఎన్నికల వ్యయం రూ.620.14 కోట్లు (18.50)శాతం అని తెలిపింది. జాతీయ పార్టీలు రూ.2,204.31 కోట్లు (65.71శాతం) ఖర్చు చేస్తే, ప్రాంతీయ పార్టీలు రూ.1,148.49 కోట్లు (34.21) శాతం ఖర్చు చేసినట్లు వెల్లడించింది. ఎక్కువగా ఖర్చు చేసిన ప్రధాన పార్టీల్లో వైసీపీ రూ.325.67 కోట్లు (9.71శాతం), బీజేడీ రూ.278.03 కోట్లు (8.29శాతం), టీఎంసీ రూ.147.68 కోట్లు (4.40శాతం) ఉన్నాయి. పార్టీలు ప్రకటించిన మొత్తం వ్యయంలో నుంచి అత్యధికంగా రూ.2,008.29 కోట్లు (53.52 శాతం) ప్రకటనల కోసమే ఖర్చు అయిందని నివేదిక తెలిపింది. అలాగే, ప్రయాణాల ఖర్చు రూ.795.41 కోట్లు, అభ్యర్థులకు ఏకమొత్తం చెల్లింపులు రూ.402.17 కోట్లు అని వెల్లడించింది. డిజిటల్ ప్రచారం కోసం అన్ని పార్టీలు రూ.132.08 కోట్లు ఖర్చు చేయగా, అభ్యర్థుల నేర చరిత్రపై ప్రకటనలకు రూ.28.25 కోట్లు వెచ్చించాయి. డిజిటల్ ప్రచారంపై కాంగ్రెస్ రూ.47.69 కోట్లు, బీజేడీ రూ.83.03 కోట్లు, బీజేపీ రూ.1.06 కోట్లు ఖర్చు పెట్టాయి. బీజేపీ అత్యధికంగా రూ.983.92 కోట్లు పబ్లిసిటీ కోసం వెచ్చించింది. ఇందులో రూ.715.54 కోట్లు ప్రకటనలకు, రూ.187.65 కోట్లు ప్రచార సామాగ్రి కోసం, రూ.80.69 కోట్లు బహిరంగ సభల కోసం ఖర్చు చేసింది. ప్రకటనలపై కాంగ్రెస్ పార్టీ రూ.422.05 కోట్లు, ప్రచార సామాగ్రి కోసం రూ.73.72 కోట్లు, సభల కోసం రూ.7.19 కోట్లు చొప్పున వ్యయం చేసింది. ప్రయాణ వ్యయంలో బీజేపీనే అత్యధికంగా రూ.439.46 కోట్లు ఖర్చు పెట్టింది. కాంగ్రెస్ రూ.112.53 కోట్లు ఖర్చు చేసింది. కాగా, అన్ని పార్టీల ప్రయాణ వ్యయం మొత్తం రూ.795.41 కోట్లుగా ఉందని ఏడీఆర్ నివేదిక పేర్కొంది.

బ్రిటన్ సైనిక విమానాలపై దాడి

లండన్: ఇజ్రాయిల్ వ్యతిరేక వాదులు బ్రిటన్‌లో హల్‌చల్ చేశారు. సెంట్రల్ ఇంగ్లండ్‌లోని రాయల్ ఎయిర్‌ఫోర్స్ స్థావరంలోకి చొరబడి... రెండు సైనిక విమానాలపై దాడి చేశారు. అక్కడితో ఆగకుండా ఇంజిన్‌లో ఎరుపు రంగు పెయింట్ చల్లారు. విమానాలను ఇంధనం నింపడానికి, ఇతర రవాణా అవసరాల కోసం బ్రిటన్ మిలిటరీ ఈ రెండు విమానాలు ఉపయోగిస్తోంది. మరో వైపు తమ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్స్‌ఫర్డ్‌షైర్‌లోని బ్రిజ్ నార్టన్ ఎయిర్ బేస్‌లోకి చొరబడి విమానాలను ధ్వంసం చేసినట్లు పలస్తీనా యాక్షన్ గ్రూప్ అంగీకరించింది. పలస్తీనాకు చెందిన వారు... బ్రిటన్ సైనిక విమానా లను ఎందుకు ధ్వంసం చేశారంటే... గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ దాడులకు పాల్పడటాన్ని బ్రిటన్ ప్రభుత్వం బహి రంగంగా ఖండించిన ప్పటికీ... పరోక్షంగా ఆ దేశానికి మద్దతిస్తూనే ఉంది. సైనిక సరకులు పంపడం, గాజా ప్రాంతంలో గూఢచార విమానాలు ఎగు రవేయడం, ఇజ్రాయిల్ యుద్ధ విమానా లకు ఇంధనం నింపడం కొనసాగిస్తోంది. దీంతో ఆ దేశ సైనిక విమానాలను ధ్వంసం చేసినట్లు పలస్తీనా యాక్షన్ గ్రూప్ ఎక్స్‌లో పోస్టు చేసింది. బ్రిటన్ కుట్రపూరితంగా వ్యవహరించడం మాత్ర మే కాకుండా... గాజా మారణ హోమంలో చురుకైన పాత్ర పోషిస్తోం దని, పశ్చిమాసియాలో యుద్ధ నేరాలకు పాల్పడుతోందని విమర్శించింది. మరోవైపు సైనిక స్థావరంలోకి ఆ ఇద్దరు నిందితులు ఎలా ప్రవేశించారన్న దానిపై దర్యాప్తు చేపట్టినట్లు బ్రిటన్ పోలీసువర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

పని గంటల పెంపుపై నిరసనల వెల్లువ

- కార్మిక సంఘాల ఆందోళన బాట
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే ఉద్యమమే
- చంద్రబాబు ప్రకటన దుర్మార్గం: రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పని గంటల పెంపును నిరసిస్తూ కార్మిక సంఘాలు ఆందోళనబాట పట్టాయి. ప్రభుత్వం వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నాల్గవ తేదీన మంత్రి మండలిలో పని గంటలను... ఎనిమిది నుంచి 10 గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో కేంద్ర కార్మిక సంఘాలు శుక్రవారం నిరసనలు చేపట్టాయి. విజయవాడ ధర్నా చౌక్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు పోలారి, ఇతర కార్మిక సంఘాల నేతలు నిరసనకు దిగారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉన్నాయని, దీనికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కారణమని, సామాజిక భద్రత కోడ్లు, పారిశ్రామిక సంబంధాల కోడ్లలో ఈ పని గంటల ప్రస్తావన ఉందన్నారు. అందుకే ఈ పని గంటలను ఎనిమిది నుంచి 10 గంటలకు పెంచాలని చంద్రబాబు దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందస్తుగా ప్రకటించడం చాలా దుర్మార్గమని మండిపడ్డారు. అమెరికాలోని చికాగో నగరంలో 1886లో జరిగిన పని గంటల పోరాటంలో అనేకమంది రక్త తర్పణం చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పనిని ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని, ఇది సరికాదన్నారు. కార్పొరేట్ వర్గాలకు ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని విరుచుకుపడ్డారు. రాత్రి వేళల్లో మహిళలకు ...వారి అనుమతితో సంబంధం లేకుండా పనులు చేయాలని చెప్పడంతో అత్యంత దయనీయమన్నారు. పగలే మహిళలకు రక్షణ కరువై అనేకమంది నిత్యం శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో ఇక రాత్రిపూట పనిచేయడం వల్ల చాలా దారుణాలు కొనసాగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం 2023లోనే జన్‌విశ్వాస్ అనే బిల్లు తీసుకురావడానికి ప్రయత్నించిందని, ఎన్నికల సమయంలో పక్కన పెట్టి నేడు తిరిగి ప్రవేశపెడుతున్నారన్నారు. పరిశ్రమలలో యాజమాన్యాలు కార్మికులపై అన్యాయంగా ప్రవర్తిస్తే వారికి శిక్షలు లేవని, పైగా వారు తప్పించుకునేందుకు అనేక మార్గాలను సూచించారని చెప్పారు. ఇది కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని వివరించారు. మహిళలకు మెటర్నిటీ సెలవులు ఆరు నెలలు ఉండగా... వాటిని నాలుగు నెలలకు కుదించడం అత్యంత ప్రమాదకరమని చెప్పారు. కార్మికులు, ఉద్యోగులు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కింద పనిచేస్తున్న మహిళా కార్మికులు ఉద్యమ బాట పట్టాలని, ప్రభుత్వాల మెడలు వంచి ఎనిమిది గంటల పనిని తిరిగి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా పోరాడాలని, జులై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పోలారి మాట్లాడుతూ... యోగా దినోత్సవం సందర్భంగా విశాఖకు వస్తున్న ప్రధాని మోదీ... విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ ఆంజనేయులు, మూలే సాంబశివరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చల్లా వెంకటరమణ, పసుపులేటి కోటేశ్వరరావు, రామస్వామి, ప్రభుదాసు, హమాలీ నాయకులు తిరుపతయ్య, ఏపీఎస్పీసీఎల్ నాయకులు పవన్, ఆర్టీసీ లైసెన్స్ కూలీల నాయకులు వేముల రాంబాబు, వస్త్రలత కార్మికులు, కొట్టు రమణ, సీఐటీయూ నాయకులు దుర్గారావు, నారాయణ, ఐఎఫ్‌టీయూ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వివిధ జిల్లాలలో నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కడప జిల్లాలో ఎల్.నాగసుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా, అన్నమయ్య జిల్లాలో సాంబశివ, గంగాధర్, తిరుపతిలో రాధాకృష్ణ, చిత్తూరులో కోదండం, అనంతపురంలో రాజారెడ్డి, రాజేశ్ గౌడ్, నంద్యాలలో సుంకయ్య, కర్నూలులో మునెప్ప, వినన్నపేటలో త్యాగరాజు, మచిలీపట్నంలో ఫిలిప్స్, పల్నాడులో కాసా రాంబాబు, గుంటూరులో హనుమంతు రావు, శ్రీశైలం ప్రాజెక్ట్‌లో బి.నాగిరెడ్డి, తాడేపల్లిగూడెంలో డి.సోమసుందర్, వాసు నాయకత్వంలో ఆందోళనలు కొనసాగాయి.

వలస పాలకుల దోపిడీపై అలుపెరగని పోరు

గూగి వా సంస్మరణ సభలో వేణుగోపాల్

విశాలాంధ్ర-విశాఖ: వలస పాలనలో, వలస అనంతర పాలనలో జరిగిన దోపిడీపై పోరాడిన సాహితీవేత్త గూగివా థియోంగో అని వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. వైవీకే అధ్యయన కేంద్రం, అరసం సంయుక్తంగా విశాఖలో శుక్రవారం నిర్వహించిన గూగి వా సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ గూగి వా తొలుత మార్క్సిస్టుగా... తర్వాత మావోయిస్టుగా చెప్పుకున్నారని తెలిపారు. మొదట్లో ఆంగ్ల భాషలో సాహిత్యం రాసిన ఆయన తరువాత మాతృభాష గికుయులోనే రచనలు చేశారన్నారు. అమెరికాలో ఉంటూ ఆ భాషలోనే సాహిత్య పత్రిక నడిపారని తెలిపారు. 1938లో పుట్టిన ఆయన 40 ఏళ్లు కెన్యాలో... మిగతా 47 ఏళ్లు ప్రవాసంలో జీవించారని వేణుగోపాల్ వివరించారు. 27వ ఏటే ప్రశ్నించడం ప్రారంభించారని చెప్పారు. కవిత్వం, కథ, నాటకాలు, నాటికలు, సాహిత్య విమర్శ నవలలు, పిల్లల సాహిత్యం సృజించిన గొప్ప వ్యక్తి గూగి వా అని పేర్కొన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా1952లో కెన్యా ప్రజల 'మౌమౌ' సాయుధ ఉద్యమం ప్రారంభమై 1963లో వలస పాలన అంతమయ్యే వరకు కొనసాగిందని తెలిపారు. ఆ ఉద్యమ ప్రభావంతో గూగీ రచనలు ప్రారంభించారన్నారు. 1996 ఫిబ్రవరిలో ఢిల్లీలో జాతుల సమస్యపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారని, అప్పుడే హుస్నాబాద్‌లోని స్మారక స్థూపాన్ని సందర్శించారని గుర్తుచేశారు. వలస పాలన నుండి కెన్యా విముక్తి పొందిన తరువాత అక్కడి ప్రభుత్వమే గూగీని జైలులో నిర్బంధించిందని, ఆమ్నెస్టీ జోక్యంతో జైలు నుంచి విడుదలైన ఆయన పుట్టిన చోట రక్షణ లేక దశాబ్దాలపాటు వలసవాసిగా వివిధ దేశాలు తిరిగి... చివరికి అమెరికాలో స్థిరపడ్డారని తెలిపారు. జైలు జీవితం గడుపుతున్నప్పుడు డెవిల్ ఆన్ ది క్రాస్ (మట్టికాళ్ల మహారాక్షసి)ను గికుయు భాషలో రాశారని చెప్పారు. అనంతరం ఆయనే ఇంగ్లీషులోకి అనువాదం చేశారన్నారు. ఆ తరువాత ఇంగ్లీషులో ఏదీ రాయ కూడదని నిర్ణయించుకున్నారని, మాతృభాషే సాంస్కృతిక జీవనది అని గుర్తించిన ఆయన... అనంతర కాలంలో తన మాతృభాష గికుయులోనే రచనలు చేశారన్నారు. గికుయు భాషలో రాసిన మాటిగరిని కనీసం ఇంగ్లీషులోకి కూడా అనువాదం చేయలేదన్నారు. గికుయు భాషలో గూగి వా చేసిన రచనలకు ప్రఖ్యాత బుకర్ ప్రైజ్ వచ్చిందని తెలిపారు.

గూగివా రచనలు చదువుతుంటే ఆఫ్రికా గురించి కాకుండా మన దేశం గురించీ, మన సమాజం గురించీ, ప్రపంచీకరణలో మనం ఎదుర్కొంటున్న సమస్యల గురించీ మనకు అర్థమవుతుందని వేణుగోపాల్ తెలిపారు. ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా, డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా ఉన్న గూగీ వా నైరోబి విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు బోధనను తొలగించాలని సంచలన వ్యాఖ్యలు చేశారని అన్నారు. మిత్ర సాహితి విశాఖ వర్మ మాట్లాడుతూ కెన్యా, భారత్... రెండు బ్రిటిష్ వలస పీడిత దేశాలని చెప్పారు. తేయాకు తోటల్లో పనిచేసేందుకు రైల్వే లైన్లు వేసేందుకు మన దేశం నుంచి అనేక మందిని బ్రిటిష్ పాలకులు కెన్యా తీసుకెళ్లారని తెలిపారు. వారిలో ముకాన్ సింగ్ కార్మిక సంఘాలు స్థాపించారని, కెన్యా స్వాతంత్ర్యం కోసం కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర్యా నంతరం భారతీయులు కెన్యాలో వ్యాపారులుగా స్థిరపడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మార్క్సిస్టు అధ్యయన వేదిక కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. అరసం ప్రతినిధి సీఎం క్షేత్రపాల్, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.